విశాఖపట్టణం
శనివారం1 ఆగస్టు 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:189 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# నేడు స్కూల్స్‌కి సెలవు

(విశాఖపట్నం - జయజయహే)



భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్‌కు రానున్న నేపథ్యంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని ప్రైవేటు పాఠశాలలకు అధికారులు శుక్రవారం, శనివారం సెలవులు ప్రకటించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలను తరలించేందుకు ప్రైవేటు బస్సులను వినియోగించనున్నందున రవాణా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు.ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు ఇప్పటికే అధికారుల నుంచి ..మిగతా 2లో





## 2 గంటల.. 25 నిమిషాలు!

అల్లూరి ఎయిర్ పోర్టులో ప్రధాని మోడీ షెడ్యూల్

ఢిల్లీ నుంచి నేరుగా భోగాపురానికే

పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం

(విజయనగరం - జయజయహే)

భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి వస్తున్న ప్రధాని మోదీ నిమిషాల వారీ షెడ్యూల్ విడుదలైంది. శనివారం ఉదయం 10 గంటల 45 నిమిషాలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి నేరుగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. 10 గంటల 45 నిమిషాల నుంచి 10 గంటల 50 నిమిషాల మధ్య గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రధానికి స్వాగతం ..మిగతా 2లో

## భోగాపురానికి ఎయిర్ ఇండియా షెడ్యూల్

2

హైదరాబాద్, బెంగళూరు, విజయవాడలకు సర్వీసులు

# ఇక ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు

అల్లూరి ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్రకు గేట్ వే

తెలుగు కళలు, సంస్కృతి ఉట్టిపడేలా విమానాశ్రయ ప్రాంగణం

గిరిజన సంప్రదాయ నృత్యం థింసాకు గిన్నీస్ వరల్డ్ రికార్డు

ఉత్తరాంధ్ర ఆర్థిక ప్రగతికి ఊతమిచ్చేలా కార్యకలాపాలు

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభోత్సవ ఏర్పాట్లను చంద్రబాబు సమీక్ష



(విశాఖపట్నం - జయజయహే)

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ విమానాశ్రయాన్ని ఏవియేషన్, ఏరోస్పేస్ హబ్ గా తీర్చిదిద్దాలని సూచించారు. ఏఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికేలా కార్యక్రమం నిర్వహించాలని సీఎం సూచించారు. విశాఖలోని పోర్టు గెస్ట్ హౌస్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. తెలుగు కళలు, సంస్కృతీ వారసత్వ వైభవాన్ని చాటేలా విమానాశ్రయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ సంస్కృతీ, సంప్రదాయాలు, కళలు ఉట్టిపడేలా అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అలంకరించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విమానాశ్రయ స్వాగత ద్వారం వద్ద ఆకట్టుకునేలా భారీ స్థాయి ఏటికొప్పాక కళాకృతి ఏర్పాటు చేశామన్నారు. విమానాశ్రయ ప్రాంగణం లోపల ఆంధ్రప్రదేశ్ సంస్కృతికి అద్దం పట్టేలా తోలు బొమ్మలు, బొబ్బిలి వీణ, నాదస్వరం, లేపాక్షి నంది చిత్రాలతో పాటు భౌగోళిక వారసత్వాన్ని చాటే బంగినపల్లి మామిడి లాంటి చిత్రాలను అలంకరించామని సీఎంకు వివరించారు. ప్రత్యేకించి ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికేలా 13,500 మంది గిరిజన ..మిగతా 2లో

## మీ రాక కోసం ఎదురు చూస్తున్నాం.. మోదీజీ..!

భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ వేళ సీఎం పోస్టు

ఉత్తరాంధ్రకు గేట్‌వేగా నిలుస్తుందని ఆకాంక్ష

2

# రిటైర్మెంట్ రోజే.. సస్పెన్షన్

ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై వేటు


అవినీతి, అక్రమాలు, ఉల్లంఘనలకు పాల్పడ్డారు

ప్రభుత్వానికి విజిలెన్స్ అధికారుల నివేదిక

హుటాహుటిన సమావేశమై సస్పెండ్ చేసిన ఏయూ కౌన్సిల్

(విశాఖపట్నం - జయజయహే)

విశాఖపట్నంలోని చరిత్రాత్మక ఆంధ్రా యూనివర్సిటీ పరిపాలనా విభాగంలో తీవ్ర కలకలం రేగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏయూ వైస్ ఛాన్సలర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డిపై పాలకవర్గం సస్పెన్షన్ వేటు వేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రసాద్‌రెడ్డి సుదీర్ఘ సర్వీసు ముగించుకుని సరిగ్గా పదవీ విరమణ చేయాల్సిన రోజే ఈ నిర్ణయాన్ని ప్రకటించడం వర్సిటీ వర్గాల్లోనూ, రాష్ట్ర విద్యా రరంగంలోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ సస్పెన్షన్ నిర్ణయానికి ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తోపాటు అంతర్గత విచారణ కమిటీలు సమర్పించిన నివేదికలే ప్రధాన ప్రాతిపదికగా నిలిచాయి. గత ఐదేళ్ల ..మిగతా 2లో





## 4.5 లక్షల కోట్ల ప్రాజెక్టులు, పథకాలు

కిసాన్ సమ్మాన్ నిధి మరో ఐదేళ్లు పొడిగింపు

ఖేల్ ఇండియాకు చేయూత

సముద్ర పథకానికి భారీ కేటాయింపులు.. కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

కేంద్ర కేబినెట్ నేడు రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ వివరాలను మంత్రి అశ్విని వైష్ణవ్ తాజాగా వెల్లడించారు. మొత్తం 4,50,988 కోట్ల రూపాయల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. ఇప్పటికే తలసరి సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ మొదటి స్థానంలో ఉందని మంత్రి అన్నారు. ఈ పథకం కింద డ్యామ్‌లు, సరస్సులపై ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి 5000 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని అన్నారు. రాబోయే ఐదేళ్లల్లో ఫ్లోటింగ్ సోలార్ ప్యాసెల్ విద్యుత్ ఉత్పత్తిని 7 రెట్లు పెంచుతామని చెప్పారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు ..మిగతా 2లో




## 45 లక్షల ఓట్ల తొలగింపు

మృతులు 15.22 లక్షల మంది

అందుబాటులోని వారు 22.30 లక్షలు

ఒకటి కంటే ఎక్కువ ఓట్లు 7.37 లక్షలు

మార్పులు, చేర్పులకు అవకాశం

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

(అమరావతి - జయజయహే)

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేసిన భారత ఎన్నికల సంఘం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. ఈ సవరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 45 లక్షల మంది ఓట్లను జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. తొలగించిన ఓట్లలో శాశ్వతంగా నివాసాలు మార్చినవారు లేదా అందుబాటులో లేనివారు 22.30 లక్షల మంది ఉన్నారు. అలాగే మృతి చెందిన 15.22 లక్షల మంది పేర్లను, ఒకటి కంటే ..మిగతా 2లో

ప్రజలు ఛీత్కరిస్తున్నా ప్రభుత్వం

# బుద్ధి మారడం లేదు

పాలకులకు బుద్ధి రావడం లేదు

రాజకీయ కక్ష సాధింపునకు ప్రజా స్వామ్య వ్యవస్థలను, రాజ్యాంగ వ్యవస్థలపై ఒత్తిడి తేస్తారా..?

వైఎస్సార్ సీపీ అధినేత జగన్ మానవతా దక్పథంతో పరామర్శకు వెళితే ఆంక్షలు విధిస్తారా..?

కార్యకర్తలు జై జగన్ అంటూ నినదిస్తే

మహిళా ఎస్ ఐ పై హత్యాయత్నాం అంటూ కేసు నమోదు చేయడం దుర్మార్గం

కూటమి ప్రభుత్వ తీరుతో వ్యవస్థల మనుగడుకు ప్రమాదకర సంకేతాలు

ప్రభుత్వ కుట్రపూరిత బెదిరింపులకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు భయపడరు

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతూనే ఉంటారు... బొత్స సత్యనారయణ హెచ్చరిక




(విశాఖపట్నం - జయజయహే)

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను, చట్టబద్ధమై వ్యవస్థలను పూర్తిగా తుంగలోకి తొక్కి కూటమి ప్రభుత్వం తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని శాసన మండలిలో విపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ తీవ్రం స్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయ కక్షసాధింపే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు బనాయించడం, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేయడం, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం ఈ ప్రభుత్వానికి నిత్యకృత్యంగా మారిందని ఆగ్రహం ..మిగతా 2లో



## థింశా నృత్యం.. గిన్నీస్ వరల్డ్ రికార్డు

13వేల మందితో గిరిజన సంస్కృతిక నృత్యం

భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ వేళ ప్రదర్శన

(భోగాపురం - జయజయహే)

ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక చరిత్రలో మరో సువర్ణాధ్యాయం ఆవిష్కృతమైంది. ఉత్తరాంధ్ర విశిష్ట గిరిజన సాంప్రదాయ నృత్యమైన థింసా ప్రపంచ వేదికపై సరికొత్త రికార్డులను తిరగరాసింది. రాష్ట్రానికి విచ్చేస్తున్న ..మిగతా 2లో

For a pure tomorrow.. జయహో

# ఇక ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు

**మొదటి పేజీ తరువాయి...**

మహిళలతో థింసా నృత్యాన్ని కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. రిహార్సల్ గా చేసిన ఈ నృత్యానికి గిన్నీస్ వరల్డ్ రికార్డు కూడా సాధించినట్టు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. అలాగే విమానాశ్రయంలో దేశంలోనే అతిపెద్ద ఎల్ఈడీ డిస్ప్లే వాల్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విమానాల రాకపోకలు, సర్వీసుల వివరాలు తెలియచేసేలా ప్రయాణికుల కోసం ఎల్ఈడీ వాల్ ను ఏర్పాటు చేసినట్టు సీఎంకు వివరించారు.

**ప్రధానికి గిరిజన థింసా నృత్యంతో ఘన స్వాగతం**

ఉదయం 10.45 గంటలకు ఢిల్లీ నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోనున్న ప్రధాని నరేంద్ర మోదీకి... రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తదితరులు స్వాగతం పలకనున్నారు. అనంతరం



10.58 గంటలకు ప్రధాని ఎయిర్ పోర్టు టెర్మినల్ భవనాన్ని ప్రారంభిస్తారు. దాదాపు 12 నిముషాల పాటు టెర్మినల్ భవనంలో గడపనున్నారు. విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన తెలుగు కళాకృతులు, సంస్కృతీ వారసత్వ వైభవాన్ని చాటి చెప్పేలా ఏర్పాటు చేసిన చిత్రాలను ప్రధాని తిలకించనున్నారు. టెర్మినల్ భవనం నుంచి బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకునే సమయంలో ప్రధాని మోదీకి గిరిజన సంప్రదాయ నృత్యం థింసాతో మహిళలు, బాలికలు ఘన స్వాగతం పలకనున్నారు. ఏక రూప దుస్తులు ధరించిన గిరిజన మహిళలు, బాలికలు థింసా నృత్యంతో ప్రధానికి, ఇతర అతిథులకు విశిష్టమైన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం బహిరంగ సభా వేదిక ప్రాంగణానికి చేరుకోనున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, పి.నారాయణ, కొండపల్లి శ్రీనివాస్ సహా ఇతర ప్రజాప్రతినిధులు, సీఎస్ సాయి ప్రసాద్, ఐ అండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆయా జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## రాత్రి పూటా ఉక్కపోతే

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

రైతులు పంటలు వేసే వేళ భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం తన నెలవారీ అంచనాలు వెల్లడించింది. మలిదశ రుతుపవన వర్షాలు సాధారణంగా కంటే తక్కువగా కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అంటే ఆగస్టు, సెప్టెంబర్ వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదువుతుందని అంచనా వేసింది. ఆగస్టు–సెప్టెంబర్ కాలంలో దేశవ్యాప్త వర్షపాతం దీర్ఘకాలిక సగటు (ఎల్పీఏ)లో 94 శాతం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఒక నెల లేదా సీజన్‌లో నమోదైన వర్షపాతాన్ని, సాధారణంగా 30 నుంచి 50 సంవత్సరాల సుదీర్ఘ కాలానికి సగటుగా లెక్కించడాన్ని ఎల్పీఏ అంటారు. 1971 నుంచి 2020 వరకు చారిత్రక డేటా ప్రకారం, ఆగస్టు–సెప్టెంబర్ కాలానికి దేశవ్యాప్త సగటు వర్షపాతం (ఎల్పీఏ) 422.8 మి.మీ.గా ఉంది. వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర మాట్లాడుతూ, "ఆగస్టు–సెప్టెంబర్ కాలంలో దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతుంది. అయితే దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, మధ్య భారతదేశం, వాయువ్య భారతదేశంలోని ఉత్తర ప్రాంతాలు, తూర్పు, ఈశాన్య భారతదేశాల్లో మాత్రం సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉంది" అని తెలిపారు.

## 45 లక్షల ఓట్ల తొలగింపు

**మొదటి పేజీ తరువాయి...**

ఎక్కువ చోట్ల ఓట్లు కలిగి ఉన్న 7.37 లక్షల మంది పేర్లను జాబితా నుంచి తొలగించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలో 3.71 కోట్ల మంది ఓటర్ల (89.22 శాతం) నుంచి ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించారు. బూత్ స్థాయి అధికారులు సంప్రదించినప్పుడు అందుబాటులో లేనివారు, ఇతర రాష్ట్రాలు లేదా కేంద్రపాలిత ప్రాంతాలకు వలస వెళ్లినవారు, ఉనికిలో లేనివారు, జూలై 24 నాటికి ఫారాలు సమర్పించని వారు లేదా వివిధ కారణాల వల్ల నమోదు చేసుకోవడానికి ఇష్టపడని మిగిలిన ఓటర్ల (44.89 లక్షల మంది) పేర్లను తొలిగించాల్సి వచ్చింది. రాష్ట్రంలో జూన్ 15 నుండి జూలై 24 వరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియ అత్యంత పకడ్బందీగా కొనసాగింది. జూలై 24 నాటికి ఉన్న 4,16,27,694 మంది ఓటర్లలో, మొత్తం 3,71,38,182 మంది ఓటర్లు తమ ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించారని, ఈ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం అద్భుతంగా ఉందని సీఈఓ తెలిపారు.

**మార్పులు, చేర్పులు మరో అవకాశం**

అర్హత ఉండి తొలగించిన నిజమైన ఓటర్లు ఎవరైనా ఉంటే, వారు జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు జరిగే అభ్యంతరాలు, దాఖలాల కాలంలో ఫారం–6తో పాటు నిర్దేశిత డిక్లరేషన్ ఫారమ్‌ను సమర్పించి మళ్లీ ఓటరు జాబితాలో పేరును జోడించుకోవచ్చని సీఈఓ స్పష్టం చేశారు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు ఉన్నవారి పేర్లను కేవలం ఒక్కచోట మాత్రమే ఉంచుతామని తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల ఆధ్వర్యంలో జూలై 31 ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలయింది.

**షెడ్యూల్ వివరాలు**

దాఖలాలు, అభ్యంతరాల స్వీకరణ జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు ఉంటుంది. దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం జూలై 31 నుండి సెప్టెంబర్ 28 వరకు నిర్వహిస్తారు. తుది ఓటర్ల జాబితా విడుదల అక్టోబర్ 3న ప్రకటిస్తారు. రాష్ట్రంలోని 28 జిల్లాల కలెక్టర్లు, 175 మంది ఈ ఆర్వోలు, 1,079 మంది ఏఈఆర్వోలు, 4,650 మంది బీఎల్వోలు సూపర్‌వైజర్లు, 46,397 పోలింగ్ కేంద్రాల్లో నియమించిన 46,397 మంది దీూాల సమన్వయంతో ఈ ఎన్యుమరేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. రాజకీయ పార్టీలు కూడా ఈ ప్రక్రియలో చురుగ్గా పాల్గొని మొత్తం 1,27,868 మంది బీఎల్ఏలను నియమించాయి. ఎస్ ఐ ఆర్ ప్రారంభ సమయంలో ఏపీలో 68,868 బీఎల్ ఏ లు మాత్రమే ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య పెరగడం విశేషం.

## థింశా నృత్యం.. గిన్నీస్ వరల్డ్ రికార్డు

**మొదటి పేజీ తరువాయి...**

ప్రధాని నరేంద్ర మోదీకి అపూర్వ శైలిలో ఘన స్వాగతం పలికేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగంగా ఒకే వేదికపై ఏకంగా 13 వేల మంది గిరిజన కళాకారులు ఏకకాలంలో థింసా నృత్యాన్ని ప్రదర్శించి విశ్వవేదికపై చరిత్ర సృష్టించారు. వేలాది మంది కళాకారులు ఒకే లయలో అడుగులు వేస్తూ ప్రదర్శించిన ఈ నృత్య రూపకం రికార్డుల రారాజు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో అధికారికంగా చోటు దక్కించుకుంది. గతంలో 11 వేల మంది గిరిజన కళాకారులతో ప్రదర్శించిన థింసా నృత్యమే అతిపెద్ద రికార్డుగా ఉండగా, ఆ పాత రికార్డును తిరగరాస్తూ ఏపీ ప్రభుత్వం ఈ బృహత్తర ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రధానమంత్రి పర్యటన నిమిత్తం విచ్చేసే మార్గంలో ఆయనకు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికేందుకు పాడేరు, సీతాంపేట, పార్వతీపురం , రంపచోడవరం వంటి ఏజెన్సీ ప్రాంతాల నుండి వచ్చిన వేలాది మంది గిరిజన మహిళలు, విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోయారు. 400కు పైగా బృందాలుగా ఏర్పడి, లయబద్ధమైన కాళ్ల ఘల్లులతో పక్కా సమన్వయంతో చేసిన ఈ ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఈ చారిత్రాత్మక రికార్డు నమోదు ప్రక్రియ అత్యంత నిబంధనల నడుమ సాగింది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక ప్రతినిధులు నేరుగా హాజరై ప్రదర్శన రిహార్సల్స్ , తుది ప్రదర్శనను పూర్తిస్థాయిలో పరిశీలించారు. వేలాది మంది కళాకారులు ఒకే వేదికపై ఒకేసారి ఎలాంటి తప్పులు లేకుండా గిరిజన వాయిద్యాల శబ్దాలకు అనుగుణంగా అడుగులు వేయడం, లయ తప్పకుండా ప్రదర్శన పూర్తి చేయడాన్ని ప్రతినిధుల బృందం సాంకేతికంగా పరిశీలించి ధృవీకరించింది. అనంతరం ఈ ప్రదర్శన సరికొత్త గిన్నిస్ వరల్డ్ రికార్డుగా నమోదైనట్లు ప్రకటించారు. ఈ మైలురాయిని సాధించడంపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సమక్షంలో గిన్నిస్ బుక్ ప్రతినిధులు అధికారిక రికార్డు పత్రాన్ని అందజేశారు. గిరిజన సంస్కృతికి, వారి కళారూపాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడం తమ ప్రభుత్వానికి దక్కిన గొప్ప గౌరవమని ఈ సందర్భంగా మంత్రి హర్షం వ్యక్తం చేశారు. సంప్రదాయ సంస్కృతిని కాపాడుకుంటూనే, గిరిజన కళాకారుల ప్రతిభను విశ్వవ్యాప్తం చేసేందుకు ఈ విజయం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన సంక్షేమానికి , సాంస్కృతిక రక్షణకు ఇస్తున్న ప్రాధాన్యతకు ఈ గిన్నిస్ రికార్డే నిదర్శనమని రాజకీయ, సామాజిక వర్గాలు ప్రశంసిస్తున్నాయి. ప్రధాని మోదీ పర్యటన వేళ ఒకేసారి 13 వేల మంది గిరిజన కళాకారులు విశ్వవిజయం సాధించడం అటు ఉత్తరాంధ్ర ఏజెన్సీ ప్రాంతాల్లోనూ, ఇటు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహాన్ని నింపింది.

## భోగాపురానికి ఎయిర్ ఇండియా షెడ్యూల్

(హైదరాబాద్ - జయజయహే)

భోగపురం విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలు ఆగస్టు 17న ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియా అక్టోబర్ 24 వరకు తన విమాన షెడ్యూల్‌ను ప్రకటించింది. హైదరాబాద్–భోగపురం మధ్య ప్రతిరోజూ ఐదు సర్వీసులను, బెంగళూరు–భోగపురం మధ్య ప్రతిరోజూ రెండు సర్వీసులను నడపనుంది. దీంతోపాటుగా అదనంగా వారంలో ఐదు రోజులు (ఆదివారాలు, శుక్రవారాలు మినహా) ఒక సర్వీసును నడుపుతామని ఆ విమానయాన సంస్థ పేర్కొంది. విజయవాడ, భోగపురం మధ్య ప్రతిరోజూ నాలుగు సర్వీసులను నడపనున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది.

## 2 గంటల.. 25 నిమిషాలు!

**మొదటి పేజీ తరువాయి...**

పలుకుతారు. పది 50 నుంచి పది 55 నిమిషాల మధ్య ప్రయాణికుల టెర్మినల్ భవనానికి ప్రధాని, గవర్నర్, సీఎం, కేంద్ర–రాష్ట్ర మంత్రులు చేరుకుంటారు. 10 గంటల 55 నిమిషాల నుంచి పది 58 మధ్య 200 మంది విద్యార్థులు కూచిపూడి నృత్యంతో ప్రధానికి ఘనస్వాగతం పలుకుతారు.

రెండు గంటల 25 నిమిషాల పర్యటన: 11 గంటల నుంచి 11 గంటల 15 నిమిషాల వరకు అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను ప్రధాని పరిశీలిస్తారు. 11 గంటల 17 నిమిషాల నుంచి 11 గంటల 25 నిమిషాల మధ్య టెర్మినల్ భవనం నుంచి ఓపెన్ టాప్ జీప్‌లో బహిరంగ సభా వేదికకు ప్రధాని చేరుకుంటారు. పదకొండున్నర నుంచి 12 గంటల 55 నిమిషాల మధ్య విమానాశ్రయ ప్రారంభోత్సవం, శిలాఫలక ఆవిష్కరణ, అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, బహిరంగసభలో ప్రధాని ప్రసంగం ఉంటాయి. మధ్యాహ్నం ఒంటి గంటా 5 నిమిషాల నుంచి ఒంటి గంటా 10 నిమిషాల సమయంలో భోగాపురం నుంచి ప్రత్యేక విమానంలో ప్రధాని తిరుగు ప్రయాణమవుతారు. మొత్తంగా దాదాపు రెండు గంటల 25 నిమిషాల పాటు భోగాపురం పరిసర ప్రాంతాల్లో ప్రధాని మోదీ పర్యటన సాగనుంది. భోగాపురం విమానాశ్రయానికి ఫ్లైట్ షెడ్యూల్‌ను ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విడుదల చేసింది. ఆగస్టు 17 నుంచి 24 అక్టోబర్ వరకు ఫ్లైట్ షెడ్యూల్ ప్రకటించింది. హైదరాబాద్ – భోగాపురం మధ్య డైలీ ఐదు సర్వీసులు, బెంగళూరు – భోగాపురం మధ్య డైలీ రెండు సర్వీసులు తిరుగుతాయి. ఆది, శుక్రవారాలు మినహా మిగిలిన ఐదు రోజులు బెంగుళూరు – భోగాపురం మధ్య మరో సర్వీస్ నడుస్తుంది. విజయవాడ – భోగాపురం మధ్య డైలీ నాలుగు సర్వీసులు నడుస్తాయని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వెల్లడించింది.

## నేడు స్కూల్స్‌కి సెలవు

**మొదటి పేజీ తరువాయి...**

సమాచారం అందింది. దీంతో ఈ రోజు, రేపు రెండు రోజుల పాటు తరగతులు నిర్వహించకుండా సెలవులు ప్రకటించాలని సూచించారు. అయితే ప్రభుత్వ పాఠశాలలు మాత్రం యథావిధిగా పనిచేస్తాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన, ఇతర విద్యా కార్యక్రమాలు సాధారణ షెడ్యూల్ ప్రకారమే కొనసాగనున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం రాష్ట్రానికి కీలకమైన ప్రాజెక్టుగా భావిస్తున్న ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో రవాణా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు బస్సులను కార్యక్రమ నిర్వహణ కోసం వినియోగించనున్నందున విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా ప్రైవేటు పాఠశాలలకు రెండు రోజుల సెలవులు ప్రకటించారు.

## 4.5 లక్షల కోట్ల ప్రాజెక్టులు, పథకాలు

**మొదటి పేజీ తరువాయి...**

కేటాయించినట్టు మంత్రి తెలిపారు. 2026–2030 మధ్య కాలానికి ఈ మొత్తాన్ని కేటాయించినట్టు తెలిపారు. ఇక సముద్ర మంథన్ పథకానికి 84,084 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. 2030–31 వరకూ ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. సముద్రం అడుగున దాగున్న ముడిచమురు, సహజవాయువు వనరుల గుర్తింపు కోసం కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఖేలో ఇండియా పథకానికి సంబంధించి కేంద్రం రాబోయే ఐదేళ్ల కాలానికి రూ.29,054 కోట్లు కేటాయించిందని కూడా మంత్రి తెలిపారు. యూనీ డైరెక్షనల్ ట్విన్ ట్యూబ్ టన్నుల్స్ నిర్మాణానికి 9,779 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు.

## రిటైర్మెంట్ రోజే.. సస్పెన్షన్

**మొదటి పేజీ తరువాయి...**

పాలనలో ఆయన హయాంలో భారీగా నిధుల దుర్వినియోగం, నిబంధనలకు విరుద్ధంగా దొడ్డిదారి నియామకాలు, అక్రమ భవన నిర్మాణాలు , విద్యాసంస్థ నిధులను దారిమళ్లించడం వంటి తీవ్ర ఆరోపణలు రుజువయ్యాయని విజిలెన్స్ నివేదిక స్పష్టం చేసింది. వీసీ పదవిలో ఉంటూ రూ.10.60 కోట్లకు పైగా అవకతవకలకు పాల్పడ్డారని నిర్ధారిస్తూ ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విజిలెన్స్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ముఖ్యంగా విశ్వవిద్యాలయ పాలనను దారితప్పించి, నిబంధనలను బొందపెట్టిన తీరుపై ఈ విచారణలో దిగ్భ్రాంతికర అంశాలు వెలుగుచూశాయి. తప్పుడు ధ్రువపత్రాలతో అధ్యాపకుల నియామకాలు చేపడమే కాకుండా, ప్రసాద్‌రెడ్డి తన కుమార్తెకు ఎం.టెక్ లో ప్రవేశం కల్పించేందుకు ఇంటర్నల్ మార్కులను కూడా అక్రమంగా మార్చారనే అభియోగాలు రుజువయ్యాయి. వీటితో పాటు గతంలో జరిగిన శాసనమండలి , జీవీఎంసీ ఎన్నికల్లో ఏయూని ఒక రాజకీయ పార్టీ కార్యాలయంగా మార్చి ఓటర్లను ప్రభావితం చేసేందుకు విద్యార్థులు, అధ్యాపకులతో ప్రచారం నిర్వహించారనే ఆధారాలను విచారణ బృందం సేకరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రసాద్‌రెడ్డి వీసీ పదవికి రాజీనామా చేసినప్పటికీ, ఆయన ప్రొఫెసర్‌గా వర్సిటీ సర్వీసులోనే కొనసాగుతూ వచ్చారు. శుక్రవారం నాటితో ఆయన సర్వీసు ముగిసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందాల్సి ఉండగా, అంతకంటే ముందే విజిలెన్స్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నుండి వచ్చిన స్పష్టమైన ఆదేశాల మేరకు ఏయూ పాలకవర్గం అత్యవసరంగా భేటీ అయి ఈ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చర్యతో ఆయనకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సదుపాయాలు నిలిచిపోయే అవకాశం ఏర్పడింది. ఉన్నత విద్యా వ్యవస్థలో స్వయంప్రతిపత్తి కలిగిన విశ్వవిద్యాలయాన్ని వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని ప్రభుత్వం ఈ చర్య ద్వారా స్పష్టమైన సంకేతాలు పంపింది. ప్రసాద్‌రెడ్డితో పాటు అక్రమాలకు సహకరించిన మిగిలిన ఉన్నతాధికారులపై కూడా చట్టపరమైన క్రిమినల్ కేసులు, ఏసీబీ విచారణలు వేగవంతం చేయడానికి విశాఖ పోలీసులు, రాష్ట్ర దర్యాప్తు యంత్రాంగం సిద్ధమవుతోంది.

## మీ రాక కోసం ఎదురు చూస్తున్నాం.. మోదీజీ..!

(అమరావతి - జయజయహే)

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మితమైన ఈ విమానాశ్రయాన్ని శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. 'రేపు భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తున్నాం' అంటూ ఏపీ పర్యటనపై ఎక్స్‌లో ప్రధాని పోస్ట్ చేశారు. ఉత్తరాంధ్రకు మౌలిక సదుపాయాల కల్పనలో కీలక అడుగు పడుతోందని చెప్పారు. ప్రధాని పోస్ట్‌ను ట్రాక్ చేస్తూ సీఎం చంద్రబాబు రీ పోస్ట్ చేశారు. 'ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది... మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీ జీ' అంటూ పోస్టు చేశారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయని, ఉత్తరాంధ్రకు గేట్‌వేగా భోగాపురం ఎయిర్‌పోర్టు నిలుస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో ట్రాఫిక్, భద్రత, ప్రజా సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర మణిహారమని, విమానాశ్రయం రాకతో ఉత్తరాంధ్రకు పెట్టుబడులు వస్తాయని కూటమి నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని రాక సందర్భంగా 7 వేల మంది పోలీసులతో భద్రతను కట్టుదిట్టం చేశారు.

## ప్రజలు ఛీత్కరిస్తున్నా ప్రభుత్వం బుద్ధి మారడం లేదు

**మొదటి పేజీ తరువాయి...**

వ్యక్తం చేసారు. పాలనా తీరును చూసి ప్రజలు ఎంతలా ఛీత్కరిస్తున్నా సరే ప్రభుత్వం బుద్ధి, పాలకుల ఏ మాత్రం మారడం లేదని ఆక్షేపించారు. విశాఖపట్నంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై రాజకీయ కక్షతో తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపడం అత్యంత దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేసారు. చట్టాన్ని, వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ ఒక ప్రజాప్రతినిధిని వేధించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకర సంకేతమని బొత్స ఆవేదన వ్యక్తం చేసారు.

**నా రాజకీయ జీవితంలో నేనెవర్నీ బెదిరంచలేదు.. నన్నెవరూ బెదిరించలేదు, గవర్నర్ కు లేఖ ద్వారా ఫిర్యాదు చేస్తా**

శ్రీకాకుళం జిల్లోని అంపోలు జిల్లా జైలు వద్ద శ్రీ జగన్ గారి పర్యటనలో పాల్గొనేందుకు వెళ్తున్న నా పట్ల కూడా నాపై కూడా అవమానకరంగా వ్యవహరించారు. నేను కేబినెట్ హోదాలో ఉన్నా, మాజీ మంత్రిగా, బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా పోలీసు అధికారులకు ముందుగానే సమాచారం ఇచ్చినప్పటికీ నా వాహనాలను అడ్డుకోవడం అత్యంత అవమానకరమన్నారు. నేను ఏమీ జగన్ కాన్వాయ్ లో వెళ్లలేదు. రెండు కార్లలో వెళుతున్నారు. సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులను ఒక వాహనంలో, సిబ్బందిని మరో వాహనంలో తీసుకెళ్తుండగా రెండో వాహనాన్ని పోలీసులు అడ్డుకోవడం వెనుక ఎలాంటి చట్టబద్ధత లేదు. జిల్లా ఎస్పీతో మాట్లాడి, తగు సమాచారం ఇచ్చి బయలుదేరాను. అయినా సరే కింది స్థాయి అధికారులు అధికారం దుర్వినియోగం చేసి అడ్డుకున్నారు. ఈ వ్యవహారంను రాష్ట్ర గవర్నర్‌కు పూర్తి వివరాలతో లేఖ రాసి తద్వారా ఫిర్యాదు చేయబోతున్నా. కొన్ని పత్రికలు, ఛానళ్లు జరిగిన సంఘటనలను వక్రీకరించి అసత్య కథనాలు ప్రసారం చేయడం బాధాకరం. వాస్తవాలను రాయకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వార్తలను మలచడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. నేను పోలీసులను బెదిరించానంటూ తప్పుడు కొన్ని మీడియాలు తప్పుడు వార్తలు ప్రచురించాయి. నా రాజకీయ జీవితంలో నేను ఎప్పుడూ ఎవరినీ బెదిరించలేదు. నన్ను కూడా ఎవరు బెదిరించలేదు.

**మహిళా ఎస్సైపై దాడి అంటూ వక్రీకరించి హత్యయత్నం కేసు పెడతారా..?**

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. జనసందోహంలో మహిళా ఎస్ ఐ చిక్కుకున్నారు. అదే సమయంలో జై జగన్ అంటూ నినాదాల హోరు సాగుతోంది. దీంతో సదరు మహిళా ఎస్ ఐ ఆ శబ్దాలను భరించలేక చెవులు మూసుకున్నారు. దీనిని కొన్ని మీడియాలు వక్రీకరించి మహిళా ఎస్ ఐ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు దాడి చేసారని ప్రచారం చేసారు. అంతేగాక ప్రభుత్వం వాస్తవాలు తెలుసుకోకుండా కార్యకర్తలపై కూడా హత్యాయత్నం కేసులు నమోదు చేయడం దారుణం కాదా..? ప్రజాస్వామ్యంలో రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనడం నేరం కాదు కదా, రాజకీయ వేధింపుల కోసం క్రిమినల్ కేసులను ఆయుధంగా మార్చడం అత్యంత ప్రమాదకర పరిణామం. ప్రభుత్వ వైఫల్యాలను, అరాచకాలను, దుర్మార్గాలను ప్రజలు గమనిస్తున్నారు.

రాష్ట్రంలో చట్టబద్ధమైన పరిపాలన క్షీణించింది. ప్రజాస్వామ్య వ్యవస్థ లు స్వతంత్రతను కోల్పోయేలా కూటమి ప్రభుత్వం ఒత్తిడి చేస్తోంది. అధికార అహంకారంతో వ్యవహరిస్తూ, ప్రజల గొంతును అణచివేయాలని ప్రయత్నిస్తోంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి బెదిరింపులకు భయపడరు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజల పక్షాన పోరాటం సాగిస్తారు.

**మానవతా దృక్పథంతోనే జగన్ పరామర్శ పర్యటన**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గారు ప్రభుత్వం కక్షపూరితంగా అన్యాయంగా కేసులో ఇరికించి జైలు పాలు కాబడిన మా పార్టీ నేత అప్పలరాజును పరామర్శించడానికి రావడం పూర్తిగా మానవతా దృక్పథంతో తీసుకున్న నిర్ణయం. శ్రీ జగన్ పర్యటనపై ఆంక్షలు విధించిన అంశాన్ని తెలుసుకున్న పార్టీ శ్రేణులు పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా, ఏ మాత్రం ఖాతరు చేయకుండా స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి తమ అభిమాన నాయకుడు శ్రీ జగన్‌మోహన్ రెడ్డి ని చూసేందుకు తరలివచ్చారు. తమ పార్టీ శ్రేణుల అడుగడుగునా వేలాదిగా తరలి వచ్చినా సరే ఎక్కడా హింస జరగలేదు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. కార్యకర్తలు క్రమశిక్షణతో వ్యవహరించారు. అయితే ప్రజల ఆదరణను చూసి ఓర్వలేక, భయపడిన ప్రభుత్వం పోలీసు వ్యవస్థ ద్వారా కక్షసాధింపు చర్యలకు పాల్పడింది. పోలీసు వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నారు.

**భోగాపురం ఎయిర్‌పోర్టుకు స్వర్గీయ వైఎస్సార్ మొదలుపెట్టారు.. జగన్ దాదాపుగా పూర్తి చేసారు**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఆలోచన తనదేనని చంద్రబాబు నాయుడు ప్రచారం చేసుకోవడం కొత్తమే కాదు. అయితే వాస్తవానికి ఈ ప్రాజెక్టు వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ప్రారంభమైంది. అప్పట్లో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో కొత్త ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం ప్రభుత్వంతో చర్చలు జరిపింది. స్వర్గీయ వైఎస్ సీఎంగా ఉన్న సమయంలో చర్చలు సాగాయి. 2013లో స్థల పరిశీలన పూర్తై భోగాపురం అనువైన ప్రాంతంగా గుర్తించబడింది. అనంతరం శ్రీ వైఎస్ జగన్ సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూసేకరణ, పునరావాసం, మౌలిక సదుపాయాల కల్పన , కీలక అనుమతులు వంటి కీలక కార్యక్రమాలను వేగవంతం చేసి దాదాపుగా పూర్తి చేసారు. వాస్తవాలను పక్కనపెట్టి మొత్తం ఘనతను ప్రస్తుత ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకోవడం చరిత్రను వక్రీకరించడమే. అలాగే ప్రధానమంత్రి మోడీ పర్యటనను రాజకీయ ప్రచారంగా మార్చొద్దు. ప్రధానమంత్రి రాష్ట్రానికి రావడాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తారు. రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడే ప్రకటనలు వస్తే అందరూ సంతోషిస్తారు. ప్రధానమంత్రి పర్యటనను రాజకీయ ప్రచారానికి వేదికగా మార్చి గత ప్రభుత్వాల పాత్రను పూర్తిగా చెరిపివేయడం సమంజసం కాదు.

**డిఎస్సీ పేరిట 3 లక్షల మంది నిరుద్యోగుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం**

రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నియామకాలలో నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి, లక్షలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి స్పష్టమైన చట్టాలు, నిబంధనలు ఉన్నాయని, వాటిని కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ముందుగా కొందరికి ఉద్యోగాలు ఇచ్చి, తర్వాత వాటికి చట్టబద్ధత కల్పించేందుకు జీవోలను సవరించడం జరిగింది. జీవో నంబర్ 447 తీసుకొచ్చి నిబంధనలు మార్చి, సుమారు 500 మందికి అనుకూలంగా ఉద్యోగాలు కల్పించారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలోనైనా ముందుగా నియామకాలు చేసి, తర్వాత వాటిని సమర్థించేందుకు జీవో మార్చిన ఉదాహరణ చూపించగలరా?" మెరిట్ ఆధారంగా ఉద్యోగం వస్తే ప్రతి ఒక్కరూ స్వాగతిస్తారు. కానీ మానిప్యులేషన్ జరిగిందనే అనుమానం వచ్చిన క్షణం మొత్తం వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుంది. లక్షలాది మంది యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. అందుకే మేము ప్రభుత్వం నుంచి సమాధానం కోరుతున్నాం. జీవో ఎందుకు మార్చాల్సి వచ్చింది? ఎవరికి ప్రయోజనం కలిగింది? ఏ ప్రమాణాలతో ఎంపికలు జరిగాయి? అన్న మా ప్రశ్నలకు . సమాధానం చెప్పకుండా ప్రభుత్వం అసలు అంశాన్ని పక్కదారి పట్టిస్తోంది. ఈ సమావేశంలో విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కెకె రాజు, శాసనమండలి సభ్యులు కుంభ రవిబాబు, సమన్వయకర్తలు తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు పాల్గొన్నారు

# భోగాపురంపై ఉన్న శ్రద్ధ గిరిప్రదక్షిణపై లేదు!

### ట్రాఫిక్ నియంత్రణలో ఘోరంగా విఫలం..

### డేటా సెంటర్కు వేల ఎకరాలు అప్పన్న భూములు

### పచ్చ తెరలు కప్పి కొండలను పిండి చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం

### సనాతన పవన్ కళ్యాణ్ ఏమైపోయాడు?

### నరసింహా స్వామి ఆశీస్సులు లేకుంటే ఏం జరిగేదో..

### గిరిప్రదక్షిణ పై చంద్రబాబు సమీక్ష ఎందుకు చేయలేదు

### ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



**విశాఖపట్నం, జూలై 31, జయ జయహే**

గత మాసం రోజులుగా భోగాపురం విమానాశ్రయంపై ఆపసోపాలు పడిపోతున్న చంద్రబాబు ఒక్కరోజు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శ్రీ సింహాచల గిరి ప్రదక్షణపై ఎందుకు సమీక్ష నిర్వహించలేకపోయారని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ప్రశ్నించారు. ఆశీలమెట్ట కార్యాలయంలో దక్షిణ వైసీపీ శ్రేణులతో కలిసి శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. సింహాచలం గిరి ప్రదక్షణ ఏర్పాట్లపై మాట్లాడకూడదని మేము అనుకున్నామని, కానీ ఇప్పుడు మాట్లాడక తప్పడం లేదన్నారు. విశాఖను అన్ని విధాలా కాపాడుతున్నది సింహాచలం నరసింహస్వామి అని, అటువంటి ప్రతిష్ట కలిగిన సింహాచలం గిరిప్రదక్షిణ కూడా చంద్రబాబు అట్టర్ ప్లాప్ చేయించాడన్నారు. గిరి ప్రదక్షణ నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దానిని కప్పిపుచ్చుకునేందుకు అధికారులు నాయకులు పై నెట్టడం హాస్యాస్పదమన్నారు. నెల రోజుల నుండి భోగాపురం ఎయిర్పోర్టు ప్రారంభోత్సవానికి, ఐదు కోట్ల ప్రజల ఆత్మ అభిమానాన్ని మోదీ కాళ్లకు ఢిల్లీకి దాసోహం చేయడానికి దుబారా చేసే చంద్రబాబు గిరి ప్రదక్షణను విస్మరించడం దుర్మార్గమన్నారు. 10 లక్షల మంది వస్తారని నేరుగా హోం మంత్రి అనిత ముందుగా చెప్పినప్పటికీ దానికి తగ్గ ఏర్పాట్లు చెయ్యడంలో విఫలమయ్యారన్నారు. ట్రాఫిక్ లో గంటల తరబడి వాహనాలు చిక్కిపోయిన పట్టించుకునే నాధుడే లేరన్నారు. హనుమంతవాక జంక్షన్ లో భక్తులు వస్తారని తెలిసి కూడా వాహనాలను ఎందుకు మళ్ళించలేదని ప్రశ్నించారు. అంబులెన్సులు కూడా గంటల తరబడి ట్రాఫిక్ లో చిక్కుకుపోయారని అత్యవసరాలున్న ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారని వాసుపల్లి తెలిపారు. సింహాద్రి అప్పన్న ఆశీస్సులు విశాఖ ప్రజలపై ఉండడంవల్ల ఏమి జరగలేద న్నారు. సనాతన ధర్మాన్ని నేనే కాపాడుతానని చెప్పుకునే పవన్ కళ్యాణ్ గిరి ప్రదక్షణ వైఫల్యాలపై ఎందుకు స్పందించడం లేదని వాసుపల్లి ప్రశ్నించారు. కేవలం మోడీకి మాత్రమే దాసోహం అయిపోయారని, నారా చంద్రబాబు లోకేష్, పవన్ కళ్యాణ్ ఒక్కరోజు గిరిప్రదక్షిణ నిర్వహణ చేయలేక పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని, విశాఖ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవంపై బాబు బడాయి..

### విఎంఆర్డిఏ వేల ఎకరాల భూమిని జిఎంఆర్ కు ధారదత్తం చేశారు!

### ప్రజాభిప్రాయం లేకుండానే విశాఖ విమానాశ్రయాన్ని తీసేశారు!... చంద్రబాబు, నారా లోకేష్ పై వాసుపల్లి ఫైర్..

**జయ జయహే**

సొమ్ము ఒకడిది సోకొకడిదన్న చందంగా 70 శాతం భోగాపురం ఎయిర్పోర్ట్ పనులు జగన్మోహన్ రెడ్డి పూర్తి చేస్తే ఆ పుస్తకం చివర పేజీలో బడాయి బాబు సంతకం పెట్టుకుని పనికిమాలిన ఆర్భాటాలు చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ దుయ్యబట్టారు. బిడ్డను కనీ తల్లిని చంపేసినట్టు విశాఖ నుండి విమానాశ్రయాన్ని వేరు చేసే హక్కు మీకు ఎవరిచ్చారు అని వాసుపల్లి గణేష్ కుమార్ ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్లో 27 విమానాశ్రయాలు ఉన్నాయని, కేవలం ఒక్క భోగాపురం విమానాశ్రయానికి ఇంత హడావుడి చేస్తున్నారని వాసుపల్లి ఎద్దేవా చేశారు. విశాఖలోని విమానాశ్రయాన్ని చంపేసే ముందు ప్రజలు అభిప్రాయాలు తెలుసుకున్నారా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విశాఖ నుండి భోగాపురం విమానాశ్రయం కు వెళ్లడానికి ఎంతో వ్యయ ప్రయాసలు పడాల్సిన పరిస్థితి తీసుకొచ్చారని దుయ్యబట్టారు. ఇంత దూరంలో విమానాశ్రయం భారతదేశంలోనే ఎక్కడా లేదని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ముందు చూపు కలిగిన దమ్మున్న నాయకుడని వాసుపల్లి కొనియాడారు. శ్రీకాకుళం ప్రజలకు దగ్గరగా ఉంటుందని భోగాపురం విమానాశ్రయం ఏర్పాటుకు 70 శాతం త్వరగా పనులు పూర్తి చేశారన్నారు. 2 వేల ఎకరాలు ల్యాండ్ పూలింగ్ చేసి ఒక్కొక్క రైతుకు ఐదు సెంట్లు భూమి ఇవ్వడంతో పాటు ఇల్లు కట్టుకునేందుకు తొమ్మిది లక్షలు నిధులు కేటాయించారనీ గుర్తు చేశారు. పుస్తకంలో అన్ని పేజీలు జగన్మోహన్ రెడ్డి వైతే, చివరి పేజీలో చంద్రబాబు సంతకం పెట్టుకుని హంగు ఆర్భాటాలు చేస్తున్నాడని వ్యాఖ్యానించారు. ఇప్పుడు మళ్ళీ చంద్రబాబు వేల ఎకరాల భూమిని జిఎంఆర్ కు ధారా దత్తం చేశాడన్నారు. విశాఖ ఎయిర్పోర్ట్ ఉద్యోగులకు దూరం పెంచి జీతాన్ని తగ్గించి పొమ్మన లేక పొగ పెట్టారని వాసుపల్లి ఆగ్రహం వ్యక్తం చేశార. ఈ విషయంలో ఎవరితోనైనా చర్చకు సిద్ధమని నారా లోకేష్ కు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో స్టేట్,జిల్లా, సౌత్, వార్డ్ నాయకులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ హాస్టల్లో పత్రికా విలేకరుల ప్రవేశంపై ఆంక్షలు విరుద్ధం..ఎస్ ఎఫ్ ఐ

**అనకాపల్లి జయ జయహే**

సంక్షేమ హాస్టల్లో విద్యార్థి సంఘాల నాయకులు మరియు పత్రికా విలేకరుల ప్రవేశించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఎస్ఎఫ్ఐ అనకాపల్లి జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎం బాలాజీ తీవ్రంగా ఖండించారు సంక్షేమ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి విద్యార్థి సంఘాలు అలాగే వాస్తవ పరిస్థితులను ప్రజలు తెలియజేయడానికి పత్రిక విలేకరులు కీలక పాత్ర పోషిస్తారని అలాంటి వారిపై ప్రవేశ ఆంక్షలు విధించడం ప్రభుత్వ పారదర్శకతను దెబ్బతీయడమే అని విద్యార్థులు సమస్యలు మరుగునపరిచే ప్రయత్నం గా ప్రభుత్వం చేస్తున్నట్లు కనిపిస్తుందని వారు పేర్కొన్నారు విద్యార్థుల సంక్షేమ కోసం ప్రభుత్వం నిజాయితీగా పనిచేస్తే ఎలాంటి ఆంక్షలు అవసరం ఉండవని వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసర్ణించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారి హెచ్చరించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనడం జరిగింది



## పంటలు బీమాపై రైతులకు అవగాహన

**మాడుగుల జూలై 31 జయ జయహే**

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పి ఎమ్ ఎఫ్ బి వై) పంటల భీమా గురించి శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి, పి విజేత మాడుగుల, కేజే పురం, జమ్మదేవిపేట, ముకుందపురం గ్రామాలను సందర్శించి రైతులతో మాట్లాడి పంట బీమా ఆవశ్యకతను వివరించారు. అలాగే పంట బీమా నమోదు చేసుకునే చివరి తేది సమీపిస్తున్నందున పంట నమోదుకు రైతులు బ్యాంకు పాస్ పుస్తకం ,భూమి పట్టా ,ఆధార్ నెంబర్ కి లింక్ అయిన మొబైల్ నెంబర్, రైతు డిక్లరేషన్ ఫారం తో ఎకరాకు రైతు కట్టవలసిన 84/- చెల్లించి పంట నమోదు త్వరగా నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. అలాగే మీ సేవా కేంద్రాలలో నమోదు ఎలా జరుగుతుంది అనే విషయాన్ని వివరించారు.కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారిని అనసూయ, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

# గోదావరి వరద ఉద్ధృతి

### ముందస్తు చర్యలకు మంత్రి పొంగులేటి ఆదేశం

### గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయండి

### ఖమ్మం కలెక్టర్‌కు మంత్రి పొంగులేటి ఆదేశాలు

**జయ జయహే**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద ఉద్ధృతి పెరుగుతున్న నేపథ్యంలో, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి శుక్రవారం సాయింత్రం ఖమ్మం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకరతో టెలిఫోన్‌లో మాట్లాడి, గోదావరి వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతున్న దృష్ట్యా నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అలాగే ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వాములుగా చేయాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే వరద ముప్పు ఉన్న గ్రామాల ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకుండా అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. లాశయాలకు భారీగా వరద నీరు చేరుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రాజెక్టుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, దిగువ ప్రాంత ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చినందున మూడవ ప్రమాదహెచ్చరిక జారీ చేశామని, ఎగువ నుంచి వచ్చి చేరుతున్న భారీ వరదతో నీటి మట్టం మధ్యాహ్నానికి ఏకంగా 48 అడుగులకు చేరుకుందని ఈ సందర్భంగా కలెక్టర్ మంత్రి గారి దృష్టికి తీసుకువచ్చారు.



### అభివృద్ధికి మారుపేరు

## కూటమి ప్రభుత్వం

**మాడుగుల జూలై 31 జయ జయహే**

రాష్ట్రంలో అభివృద్ధికి మారుపేరు కూటమి ప్రభుత్వం అని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ చెప్పారు. ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం మాడుగుల వీధుల్లో కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాల గురించి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. గడిచిన రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. అర్హులైని ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ప్రతి గ్రామంలో కూడా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. అలాగే మాడుగుల నియోజవర్గంలో కూడా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో అభివృద్ధి ముందుకు సాగుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో రోజుల్లో మరిన్ని అభివృద్ధి సంక్షేమ ఫలాలు చూస్తామన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరు దీవించాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ అధ్యక్షుడు కొట్నాల త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.




## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడిఉంది.

### ఎమ్మెల్యే అధిములం

**బుచ్చినాయుడు కండ్రిగ, జులై 31,జయ జయహే**

గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడిఉందనిఎమ్మెల్యేఅధిములం అన్నారు. బి ఎన్ కండ్రిగ మండల సర్వసభ్య సమావేశంలో సత్యవేడు ఎమ్మెల్యే కొనేటి ఆదిమూలం పాల్గొన్నారు.పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి సత్యవేడు నియోజకవర్గ శాసనసభ్యులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు మండల నాయకులు, మహిళలు పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. అనంతరం సభలో ఆయనకు శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు.సమావేశంలో ఎమ్మెల్యే మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజాపక్షపాత ప్రభుత్వం నడుస్తోందని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, మనోహర్ నాయుడు, సత్యనారాయణ, నెల్లూరు బాలకృష్ణ,గోపి, పెద్దపాలుడు చంద్ర, పురుషోత్తం, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, రెవిన్యూ ఇన్స్పెక్టర్ నల్లయ్య, సబ్ ఇన్స్పెక్టర్ హరి ప్రసాద్,అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ముగిసిన వెంకన్న పవిత్రోత్సవాలు

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక దేవుని గుమ్మం వేంచేసి ఉన్న శ్రీ శ్రీ అలివేలు మంగ సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం పవిత్రోత్సవాలు జరుగుచున్నవి. ధ్వజస్తంభం ప్రతిష్ట చేసి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వజ్జల నరసింహాచార్యులు వారి ఆధ్వర్యంలో 1970 లో ఈ పవిత్రోత్సవాలు ప్రారంభించబడి ఆనాటి నుండి ఈనాటి వరకు కూడా ప్రతి సంవత్సరం సప్త అనిహిక పవిత్రోత్సవం పాంచరాత్ర ఆగమోక్తముగా జరుగుచున్నవి. ఈనెల 25వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు 31వ తేదీ శుక్రవారం తో పవిత్రోత్సవాలు పరిసమాప్తి కావడం జరిగింది. ఆఖరి రోజు శుక్రవారం నాడు స్వామివారికి సుప్రభాత సేవ, నిత్య హోమం, చూర్ణోత్సవం, అష్టదిక్పాలక, బలిహరణ,వసంతోత్సవం ఉత్సవమూర్తులకు అభిషేకం చక్రస్నానం పూర్ణాహుతి హోమం అలాగే స్వామివారికి 1001 ఏకోత్తర సహస్ర కలశాలతో మరియు 108 అష్టోత్తర కలశములతో అభిషేకం నిర్వహించడం జరిగింది . దేవాలయ శిఖరమునకు కుంబాభిషేకం సాయంత్రం ధ్వజారోహణ లక్ష తులసి లక్ష కుంకుమార్చన ఉత్సవాంత కళ్యాణము తో ఈ పవిత్ర ఉత్సవాలు స్వస్తి పలకడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ బి శ్రీనివాసరావు ఈవో కె చంద్ర తేజ ఆలయ అర్చకులు పొలకడం ప్రసాద్ బాబు పులకడం ప్రసాద్ ధర్మకర్తలు గుండా సాయి, జి మురళి, సిహెచ్ నూకరాజు, కె బాల అధిక సంఖ్యలో భక్తులు సేవాదల సభ్యులు తదితరులు పాల్గొన్నారు

For a pure tomorrow..
జయహో

# అల్లూరి త్యాగానికి ఇచ్చే గౌరవం

## ఉత్తరాంధ్ర భవిష్యత్తుకు ప్రతీకగా అల్లూరి సీతారామరాజు... అంతర్జాతీయ విమానాశ్రయం

**"ఒక విమానాశ్రయం కేవలం విమానాలు దిగే, ఎగిరే ప్రదేశం మాత్రమే కాదు అది ఒక ప్రాంత ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక భవిష్యత్తును నిర్దేశించే అభివృద్ధి ద్వారం." ఈ మాటకు నిదర్శనంగా నిలిచే చారిత్రాత్మక ఘట్టమే అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం.మన్యం వీరుని త్యాగస్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పే వేదిక, ఉత్తరాంధ్ర అభివృద్ధికి గగనతల ద్వారం, ఉత్తరాంధ్ర ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక కావాలి.అల్లూరి సీతారామరాజు చరిత్రను కేవలం ఒక స్వాతంత్ర్య సమరయోధుడి జీవితగాథగా చూడలేం.ఈ ప్రారంభం ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో దశాబ్దాల ఆకాంక్షకు రూపం ఇవ్వడమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధి దిశలో ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. ఈ విమానాశ్రయానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం సాధారణ నిర్ణయం కాదు. స్వాతంత్ర్య సమర చరిత్రలో తన ప్రాణాలను అర్పించి గిరిజనుల హక్కుల కోసం బ్రిటిష్ పాలకులపై సాయుధ పోరాటం చేసిన మహనీయుడి పేరు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వినిపించే అంతర్జాతీయ విమానాశ్రయానికి దక్కడం ప్రతి తెలుగువాడి గర్వకారణం.**






అభివృద్ధి అనే ఆధునిక భావనకు, త్యాగం అనే జాతీయ స్ఫూర్తిని జోడించిన ఈ నిర్ణయం చారిత్రాత్మకమైనది. అల్లూరి చరిత్రను ప్రపంచానికి పరిచయం చేసే వేదిక కావాలి. ప్రతి విమానం ఇక్కడ దిగినప్పుడు, ప్రతి ప్రయాణికుడు బయలుదేరినప్పుడు, ఈ నేల కోసం తన ప్రాణం అర్పించిన మహావీరుడి కథ ప్రపంచానికి వినిపించాలి. ఉత్తరాంధ్ర అనగానే ప్రకృతి సౌందర్యం, గిరిజన సంస్కృతి, ఖనిజ సంపద, సముద్రతీరం, వ్యవసాయ వనరులు గుర్తుకొస్తాయి. అయి-నప్పటికీ, ఈ ప్రాంతం మౌలిక సదుపాయాల విషయంలో చాలా కాలం వెనుకబడింది. మెరుగైన రవాణా సౌకర్యాల కొరత పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటక అభివృద్ధికి అడ్డంకిగా నిలిచింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పడిన విమానాశ్రయం ఉత్తరాంధ్ర ఆర్థిక రూపురేఖలను మార్చే శక్తిగా మారనుంది. పారిశ్రామిక రంగానికి ఇది ఒక గొప్ప ప్రోత్సాహం. విమానాశ్రయం చుట్టూ లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్లు, గిడ్డంగులు, ఐటీ పార్కులు, ఔషధ పరిశ్రమలు, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతి కేంద్రాలు ఏర్పడే అవకాశాలు మెరుగుపడతాయి. దీనివల్ల స్థానిక యువతకు నైపుణ్యాధారిత ఉద్యోగాలు లభిస్తాయి. పెట్టుబడిదారులకు వేగవంతమైన రవాణా సౌకర్యం కల్పించడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుంది. విద్య, వైద్య రంగాలపై కూడా దీని ప్రభావం గణనీయంగా ఉంటుంది. అత్యవసర వైద్య సేవలు, అవయవ మార్పిడి రవాణా, ఉన్నత విద్య కోసం దేశ విదేశాలకు వెళ్లే విద్యార్థులకు మెరుగైన అనుసంధానం లభిస్తుంది. అంతర్జాతీయ విద్యా, వైద్య సంస్థలు ఈ ప్రాంతంపై ఆసక్తి చూపే అవకాశాలు కూడా పెరుగుతాయి. ఉత్తరాంధ్ర -- అపార వనరులు, పరిమిత అవకాశాలు:-ఉత్తరాంధ్ర సహజ సంపదలో రాష్ట్రంలోనే అత్యంత సంపన్న ప్రాంతాల్లో ఒకటి. సముద్రతీరం, అటవీ సంపద, ఖనిజ వనరులు, కాఫీ తోటలు, ఉద్యాన పంటలు, ఆదివాసి సంస్కృతి, పర్యాటక ప్రాంతాలు---ఇన్ని ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం అసమానంగా జరిగింది. ఉపాధి కోసం వేలాది మంది యు-వత ఇతర నగరాలకు వలస వెళ్లాల్సి వచ్చింది. మెరుగైన అనుసంధానం లేకపోవడం పెట్టుబడులకు కూడా అడ్డంకిగా నిలిచింది.ఈ నేపథ్యంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఒక మౌలిక సదుపాయం మాత్రమే కాదు ఇది ఉత్తరాంధ్ర ఆర్థిక వ్యవస్థను దేశీ-య, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేసే కేంద్రంగా మారే అవకాశం ఉంది. పర్యాటక రంగానికి కొత్త ఊపు:- అరకు లోయ, బొర్రా గుహలు, లంబసింగి, గిరిజన సంస్కృతి, విశాఖ తీర ప్రాంతాలు ఇప్పటికే పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. అంతర్జాతీయ విమానాశ్రయం వల్ల దేశ విదేశాల నుండి మరింత మంది పర్యాటకులు చేరే అవకాశం ఉంది. దీని ప్రభావం హోటళ్లు, హోమ్‌స్టేలు, రవాణా, స్థానిక కళాకారులు, హస్తకళలు, గిరిజన ఉత్పత్తుల విక్రయం వంటి రంగాలపై సానుకూలంగా ఉంటుంది. రైతుకు మార్కెట్ -- యువతకు ఉద్యోగం: ఉత్తరాంధ్ర రైతులు పండించే కాఫీ, జీడిపప్పు, మిరియాలు, పండ్లు, పూలు, మత్స్య ఉత్పత్తులు వేగవంతమైన రవాణా ద్వారా కొత్త మార్కెట్లను చేరే అవకాశం పొందుతాయి. అలాగే విమానాశ్రయం చుట్టూ లాజిస్టిక్స్, గిడ్డంగులు, కోల్డ్‌చైన్‌లు, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పడితే వేలాది ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు సృష్టించబడవచ్చు.అభివృద్ధి అంటే స్థానికుల భాగస్వామ్యం: ఏ అభివృద్ధి ప్రాజెక్టు విజయాన్ని భవనాల ఎత్తుతో కొలవలేం. స్థానిక ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పుతోనే కొలవాలి. గిరిజనులు, రైతులు, మత్స్యకారులు, స్థానిక యువత అభివృద్ధిలో భాగస్వాములు కాకపోతే అది అసమాన అభివృద్ధిగానే మిగులుతుంది. పర్యావరణ పరిరక్షణ కూడా సమానంగా కీలకం. ఉత్తరాంధ్ర ప్రకృతి సంపద, అటవీ ప్రాంతాలు, జీవ వైవిధ్యం దేశానికి అమూల్యమైన సంపద. అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేయకుండా, పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, సుస్థిర అభివృద్ధి విధానాలను అమలు చేయాలి. గ్రీన్ ఎనర్జీ, వర్షపు నీటి సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ, కార్బన్ ఉద్గారాల నియంత్రణ వంటి అంశాలు విమానాశ్రయ నిర్వహణలో భాగం కావాలి. ఈ విమానాశ్రయం విజయవంతం కావడం అంటే కేవలం విమానాల సంఖ్య పెరగడం కాదు స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటం, యువతకు ఉద్యోగాలు రావడం, రైతులకు మార్కెట్లు విస్తరించడం, గిరిజనులకు ఆర్థిక స్వావలంబన కలగడం, పర్యాటక రంగం అభివృద్ధి చెందడం, ఉత్తరాంధ్ర జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా ఎదగడం. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టం. ఇది కేవలం ఒక మౌలిక సదుపాయం కాదు; భవిష్యత్తు తరాలకు ఆశ, అవకాశాలు, అభివృద్ధి, ఆత్మగౌరవాన్ని అందించే గగనతల ద్వారం. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగస్ఫూర్తికి తగిన గౌరవంగా, ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్రను ప్రపంచ పటంలో మరింత ఉన్నత స్థానంలో నిలబెట్టాలని, అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికీ సమానంగా చేరాలని ప్రతి తెలుగువాడి ఆకాంక్ష. అల్లూరి పేరు ఆకాశంలో ఎగరడం గొప్ప విషయం కాదు... ఆయన ఆశయాలు ఈ నేలపై వికసించడం గొప్ప విషయం. అదే ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి నిజమైన అర్థం.

**ఎన్.సీతారామయ్య**
**9440972048**



---

# అమెరికా-ఇరాన్ ఘర్షణ...
## ప్రపంచ శాంతికి పెరుగుతున్న ముప్పు

**హెచ్. ప్రతాప్**



మధ్యప్రాచ్యంలో అమెరికా--ఇరాన్ మధ్య కొనసాగుతున్న సైనిక ఘర్షణ రోజురోజుకూ మరింత ప్రమాదకర రూపం దాల్చుతోంది. నిన్న ఇరాన్ క్షిపణి దాడులకు ప్రతిగా అమెరికా ఇరాన్ సైనిక స్థావరాలపై విస్తృత వైమానిక దాడులు నిర్వహించింది. క్షిపణి నిల్వలు, మానవరహిత యుద్ధ విమానాల కేంద్రాలు, సైనిక నియంత్రణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నట్లు అమెరికా ప్రకటించగా, దీనికి తగిన ప్రతీకారం తప్పదని ఇరాన్ హెచ్చరించింది. ఈ పరిణామాలు ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న మధ్యప్రాచ్యాన్ని మరింత అస్థిరత వైపు నెడుతున్నాయి.

ఈ ఘర్షణ కేవలం రెండు దేశాల మధ్య యుద్ధంగా మిగిలిపోయే పరిస్థితి కనిపించడం లేదు. ఇజ్రాయెల్, ఇరాక్, జోర్డాన్, సౌదీ అరేబియా వంటి దేశాలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఈ సంక్షోభ ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ చమురు రవాణాకు జీవనాడిగా భావించే హోర్ముజ్ జలసంధి ఈ ఘర్షణకు కేంద్రబిందువుగా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా రోజుకు రవాణా అయ్యే ముడి చమురులో దాదాపు 2 కోట్ల బ్యారెళ్లు, అంటే మొత్తం వినియోగంలో సుమారు 20 శాతం, ఇదే మార్గం గుండా ప్రయాణిస్తుంది. ప్రపంచ ద్రవీకృత సహజవాయువు సరఫరాలోనూ సుమారు 20 శాతం ఈ జలమార్గంపైనే ఆధారపడి ఉంది. ఈ మార్గంలో స్వల్ప అంతరాయం ఏర్పడినా ప్రపంచ ఇంధన భద్రత తీవ్రంగా దెబ్బతింటుంది.

యుద్ధ ప్రభావం ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లలో కనిపిస్తోంది. ముడి చమురు ధరలు ఒక్క రోజులోనే 7 శాతానికి పైగా పెరిగి బ్యారెల్‌కు 90 డాలర్లకు చేరువ-య్యాయి. చమురు ధరల్లో ప్రతి 10 డాలర్ల పెరుగుదల ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటును 0.2 నుంచి 0.3 శాతం వరకు తగ్గించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. నౌకాయాన బీమా రుసుములు పెరుగుతున్నాయి. సముద్ర రవాణా వ్యయం అధికమవుతోంది. సరఫరా వ్యవస్థలు దెబ్బతింటే తయారీ, విమానయాన, విద్యుత్, ఎరువులు, రసాయన పరిశ్రమలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ద్రవ్యోల్బణం మళ్లీ వేగం పుంజుకుని ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరో సంక్షోభంలోకి నెట్టే ప్రమాదం ఉంది.

భారత్‌పై ఈ యుద్ధ ప్రభావం మరింత స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది. దేశ అవసరాలకు కావలసిన ముడి చమురులో 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతున్న భారత్, చమురు ధరల పెరుగుదలతో భారీ దిగుమతి వ్యయాన్ని భరించాల్సి వస్తుంది. పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు పెరిగి ప్రతి వస్తువు ధరపై ప్రభావం చూపుతుంది. రూపాయి విలువపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న దాదాపు 90 లక్షల మంది భారతీయుల భద్రత, వారి ఉపాధి, స్వదేశానికి పంపే విదేశీ మారకద్రవ్య ప్రవాహంపై కూడా ఈ సంక్షోభం ప్రభావం చూపవచ్చు. భారత ఆర్థిక వ్యవస్థకు ఇది అదనపు సవాలుగా మారే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో భారత్ అత్యంత సమతుల్యమైన విదేశాంగ విధానాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది. అమెరికా, ఇరాన్, గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్‌లతో సమాన దూరాన్ని పాటిస్తూ శాంతి చర్చలకు మద్దతు ఇవ్వాలి. అదే సమయంలో వ్యూహాత్మక చమురు నిల్వలను మరింత పెంచడం, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగాన్ని వేగవంతం చేయడం, దిగుమతి వనరులను విస్తరించడం అత్యవసరం. అంతర్జాతీయ వేదికలపై శాంతి స్థాపనకు భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాల్సిన సమయం ఆసన్నమైంది.

యుద్ధం ఏ దేశానికీ శాశ్వత విజయాన్ని అందించదు. అది మానవ ప్రాణాలను బలి తీసుకోవడమే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, ఇంధన భద్రతను, ఆహార సరఫరా వ్యవస్థలను, అంతర్జాతీయ శాంతిని ప్రమాదంలోకి నెడుతుంది. అమెరికా--ఇరాన్ ఘర్షణ మరింత విస్తరించేలోపు ప్రపంచ దేశాలు దౌత్యపరమైన ప్రయత్నాలను ముమ్మరం చేయాలి. నేటి ప్రపంచానికి అత్యవసరమైనది ఆయుధాల గర్జన కాదు; సంభాషణ, సంయమనం, శాంతియుత పరిష్కారమే.

---

## పట్టణీకరణ వేగం... స్మార్ట్ నగరాలు కాదు
# నివాసయోగ్య నగరాలు కావాలి

**హెచ్. ప్రతాప్**



భారత్ వేగంగా పట్టణీకరణ దిశగా పయనిస్తోంది. ఒకప్పుడు ఉపాధి, విద్య, వైద్యం కోసం నగరాలకు వలస వచ్చిన ప్రజలు, నేడు మెరుగైన జీవన ప్రమాణాల కోసం కూడా పట్టణాలను ఆశ్రయిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం ప్రస్తుతం భారత జనాభాలో సుమారు 36 శాతం మంది పట్టణాల్లో నివసిస్తుండగా, 2050 నాటికి ఈ సంఖ్య 50 శాతానికి చేరుకునే అవకాశం ఉంది. అంటే మరో రెండు దశాబ్దాల్లో కోట్లాది మంది నగరాల్లో స్థిరపడనున్నారు. ఈ మార్పు ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చే అవకాశమున్నప్పటికీ, సరైన ప్రణాళిక లేకపోతే నగరాలనే సంక్షోభ కేంద్రాలుగా మార్చే ప్రమాదం ఉంది.

భారత ఆర్థిక వ్యవస్థకు పట్టణాలే ప్రధాన చోదకశక్తి. దేశ స్థూల దేశీ-యోత్పత్తిలో దాదాపు మూడింట రెండొంతులకుపైగా వాటా పట్టణాల నుంచే వస్తోంది. అయితే అదే నగరాలు నేడు ట్రాఫిక్ రద్దీ, వాయు కాలుష్యం, నీటి కొరత, మురుగునీటి నిర్వహణ వైఫల్యం, చెత్త నిర్వహణ లోపాలు, సరసమైన గృహాల కొరత, పట్టణ వరదలు వంటి అనేక సమ-స్యలతో సతమతమవుతున్నాయి. హైదరాబాద్, బెంగళూరు, ముంబై, ఢిల్లీ, చెన్నై వంటి మహానగరాల్లో భారీ వర్షం కురిస్తే రహదారులు నదుల్లా మారడం, వేసవిలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడటం, గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోవడం సాధారణ దృశ్యాలుగా మారాయి.

ఇటీవలి కాలంలో స్మార్ట్ సిటీల నిర్మాణంపై ఎక్కువ దృష్టి పెట్టినప్పటికీ, సాంకేతిక సదుపాయాలకే పరిమితమైన అభివృద్ధి ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచలేకపోతోంది. ఒక నగరం నిజమైన అర్థంలో "స్మార్ట్" కావాలంటే, అక్కడ నివసించే ప్రజలకు పరిశుభ్రమైన గాలి, తగిన తాగునీరు, సమర్థవంతమైన ప్రజా రవాణా, అందుబాటులో గృహాలు, సురక్షిత రహదారులు, హరిత ప్రదేశాలు, నాణ్యమైన ఆరోగ్య, విద్యా సేవలు అందుబాటులో ఉండాలి. సాంకేతికత నగరాన్ని స్మార్ట్‌గా చేయవచ్చు; కానీ ప్రణాళిక, పర్యావరణ సమతుల్యత, మానవ అవసరాలే దానిని నివాసయోగ్యంగా మారుస్తాయి.

ఈ నేపథ్యంలో పట్టణాభివృద్ధి విధానంలో సమూల మార్పులు అవసరం. ప్రజా రవాణాకు ప్రాధాన్యం ఇవ్వాలి. మెట్రో, బస్సు, సైకిల్ మార్గాలు, పాదచారుల కోసం సురక్షిత మార్గాలను విస్తరించాలి. వర్షపు నీటి పారుదల వ్యవస్థలను ఆధునీకరించి, చెరువులు, కాలువలను ఆక్రమణల నుంచి రక్షించాలి. ప్రతి నగరంలో కనీస హరిత విస్తీర్ణాన్ని నిర్ధారించాలి. వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, మురుగునీటి శుద్ధి, నీటి పునర్వినియోగం తప్పనిసరి చేయాలి. తక్కువ, మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో గృహాలను నిర్మించడం కూడా ప్రభుత్వ ప్రాధాన్యత కావాలి.

అలాగే పట్టణాభివృద్ధి కేవలం మహానగరాలకే పరిమితం కాకూడదు. రెండో, మూడో శ్రేణి నగరాల్లో పరిశ్రమలు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను విస్తరించడం ద్వారా మహానగరాలపై ఒత్తిడిని తగ్గించవచ్చు. నగరాల విస్తరణకు ముందే భూవినియోగ ప్రణాళిక, పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజల భాగస్వామ్యంతో రూపొందించే పట్టణ ప్రణాళికలే దీర్ఘకాలిక ఫలితాలను ఇస్తాయి.

భవిష్యత్ భారత్ పట్టణాల్లోనే నిర్మితమవుతుంది. అయితే ఎత్తైన భవనాలు, డిజిటల్ సేవలు, ఆధునిక సాంకేతికత మాత్రమే అభివృద్ధికి కొలమానం కావు. ప్రజలు ఆరోగ్యంగా, భద్రంగా, ప్రశాంతంగా జీవించగలిగినప్పుడే నగరం నిజమైన అర్థంలో అభివృద్ధి చెందినదవుతుంది. అందుకే భారత్‌కు ఇప్పుడు కావాల్సింది స్మార్ట్ నగరాలు మాత్రమే కాదు... ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన జీవనాన్ని అందించే నివాసయోగ్య నగరాలు.

# కలెక్టరేట్‌ను ముట్టడించిన స్కీం వర్కర్స్





## కార్మికులకు తీవ్ర గాయాలు

**అనకాపల్లి జయ జయహే**

రాష్ట్రంలో వివిధ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్స్ కు కనీస వేతనాలు అమలు చేయాలని బకాయి జీతాలు వెంటనే విడుదల చేయాలని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అనకాపల్లి కలెక్టరేట్ కు అంగనవాడి కార్యకర్తలు, ఆశ,వెలుగు, వివోఏలు, మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కలెక్టరేట్ తరలి రావడం జరిగింది పలు శాఖలో విధులు నిర్వహిస్తున్న వేలాది మంది మహిళలు కలెక్టరేట్ కార్యాలయం ముట్టడించడం జరిగింది. అయితే పోలీసులు వీరిని అడ్డుకోవడంతో అక్కడ తోపులాట గలాట జరిగి ఒకరిపై ఒకరు పడిపోవడంతో చాలామందికి తీవ్ర గాయాలు అయ్యాయి. నిరసనకారులు మాకు జీతాల పెంచాలి కలెక్టర్ రావాలి మాకు సమాధానం చెప్పాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు ఇవ్వడం జరిగింది డిఆర్ఓ వచ్చి సమస్యలను అడిగి తెలుసుకున్నారు వారిచ్చిన వినతి పత్రాలు తీసుకోవడం జరిగింది అయిన నిరసనకారులు తమ నిరసనను కొనసాగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగ్ రావు పాల్గొని నిరసన కారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో కూడా కష్టపడి పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఇది చాలా దారుణమని కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు కొట్టుమిట్ట ఆడుతున్నారని కార్పొరేటర్లకు బడా పారిశ్రామికవేత్తలకు కోట్లాది రూపాయలు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం స్కీం వర్కర్స్ కు కనీస వేతనాలు ఎందుకు అమలు చేయడం లేదని ఆయన నిలదీశారు అంగన్వాడీలకు గత ప్రభుత్వ హాయంలో ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయలేదన్నారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి అత్యంత సేవ చేస్తున్న స్కీం కార్మికుల పట్ల ఈ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదని అంతేకాకుండా శానిటేషన్ కార్మికులకు ఐదు నెలలుగా ఇస్తున్న 6000 రూపాయల జీతాన్ని బకాయి పెట్టడంతో వారు ఏం తిని బ్రతకాలని ఆయన ప్రశ్నించారు వారు అర్ధాకలతో అలమటిస్తున్నారని వారి ఆవేదన వ్యక్తం చేశారు పక్కనే ఉన్న కర్ణాటక తెలంగాణ రాష్ట్రాల్లో కనీస వేతన పెంపుదల చేశాయని మన రాష్ట్రంలో ఎందుకు పెంచారని ఆయన నిలదీశారు రాష్ట్రంలో ఏళ్ల తరబడి పని చేస్తున్న పలు రంగాల్లో కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా పిఎఫ్ ఈఎస్ఐ వంటి సౌకర్యాలు లేకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారని గ్రాడ్యుటి కోసం సంవత్సరాల తరబడి పోరాడాల్సి వస్తుందని ఆయన అన్నారు ఈరోజు జరుగుతున్న ఈ కలెక్టరేట్ ఆందోళన చూసి కూటమి ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు పెంపుదలపై ప్రకటన చేయకపోతే చలో అమరావతి కి తరలి వస్తామని కూటమి ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక మంది మహిళలు అన్ని రంగాల్లో పనిచేస్తున్నారని మా ప్రభుత్వం మహిళా సాధికారిక ప్రభుత్వమని చెబుతున్న కూటమి ప్రభుత్వం పలు సంస్థల విభాగంలో పనిచేసే మహిళలు కనీస వేతనాలు ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు అంగన్వాడీ ఆశ వర్కర్లు స్కీం వర్కర్లు శానిటేషన్ వర్కర్లు వీరందరూ కనీస వేతనాలు తక్షణమే పెంచాలని వారి న్యాయమైన కోరికలు డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు

## కమ్మవారిపాలెంలో పర్యటించిన ఎమ్మెల్యే
# కోనేటి ఆదిమూలం

**బుచ్చినాయుడు కండ్రిగ, జులై 31,జయ జయహే.**

బుచ్చినాయుడు కండ్రిగమండలం లోని వేణుగోపాల్పురం పంచాయతీలో ఎమ్మెల్యే అధిములం పర్యటించారు.తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మనోహర్ నాయుడు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఇటీవల నరసింహనాయుడు కాలం చెందారు.అయన జ్ఞాపకార్థం ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కమ్మవారిపాలెంలో పక్షవాతం (పెరాలసిస్) వచ్చి మంచాన పడిన సుందరయ్య నాయుడు ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా సందర్శించారు.ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, కమ్మవారి పాలెం పార్టీ నాయకులు సత్యనారాయణ, బాలకృష్ణ, గోపి, పెద్ద పాలేదు చంద్ర, పద్మావతిపురం రామనాథం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.





## నక్కల కాలువ వంతెనకు
# మరమ్మతులు చేపట్టండి

**తలపా దామోదరం రెడ్డి**

**శ్రీకాళహస్తి, జులై 31,జయ జయహే**

పానగల్ నక్కల కాలువ కు మరమ్మతులు చేపట్టాలని నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి కోరారు.శుక్రవారం అయన ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణానికి ముఖద్వారం అయిన పానగల్ నక్కల కాలువ వంతెన వర్షాకాలంలో వరద నీరు ఉధృతంగా ప్రవహించడం ద్వారా వంతెన రిటైనింగ్ వాల్ దెబ్బతిందన్నారు.వంతెన మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని రాబోవు వర్షాకాలంలో వరదనీరు వల్ల పెను ప్రమాదం వాటిల్లకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండలం అధ్యక్షులు రాహుల్ రాయల్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగూరయ్యా, ముని కృష్ణయ్య, చందు, నాగరాజు,అరుణ్, చరణ్, జోసెఫ్,సారధి,చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కొణతనేరిలో నూతన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించిన
# ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

**తొట్టంబేడు, జులై 31,జయ జయహే.**



తొట్టంబేడు మండలం కొణతనేరి పంచాయతీ గాంధీ సెంటర్ లో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో ఈ భవన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయిందని,దీంతో చిన్నారులు చెట్ల కింద కూర్చోవాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని మాజీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, సీనియర్ నాయకులు గాలి.మురళి నాయుడు లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మండల గ్రాంట్ నుంచి రూ. 5 లక్షలు మంజూరు చేయించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయించారు.అంగన్వాడీ చిన్నారులకు ఇక సొంత భవనం ఏర్పడటంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీ సెంటర్ వాసులకు మౌలిక సదు-పాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గాంధీ సెంటర్ లో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేస్తామని, ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్ల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సిదిలమైన ప్రాథమిక పాఠశాలను తొలగించి సుమారు రూ. 25 లక్షల ప్రభుత్వ గ్రాంట్ తో కాంపౌండ్ వాల్ తో సహా నూతన పాఠశాల భవనాన్ని నిర్మిస్తామని,గిరిజనుల కోసం ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తొట్టంబేడు మండల అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజ నాయుడు, తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి చెన్ను రాఘవులు యాదవ్, ఎంపీడీవో సురేంద్రనాథ్, సీడీపీఓ శాంతి దుర్గ, పంచాయతీరాజ్ శాఖ ఏఈ ప్రీతి, గౌరీ జోష్, తంగేళ్లపాలెం సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ ముదిరాజ్, మునిరత్నం, మాజీ జడ్పిటిసి వెంకటాచలం, కొన్నలి రమేష్, ఆయకట్టు అధ్యక్షుడు లెక్కల వెంకటముని నాయుడు, కన్నలి ప్రతాప్ రెడ్డి, వున్నం ప్రసాద్, మాజీ సర్పంచులు గాలి బాలాజీ నాయుడు, కర్ణం హరిబాబు నాయుడు, మాజీ ఎంపీటీసీ భాస్కర్, అంగన్వాడీ టీచర్ అరుణ, గాలి భారతి, కస్తూరయ్యతదితరులు పాల్గొన్నారు.



## భగవన్నాం మానవుడిని
# పవిత్రుడిని చేస్తుంది

**డాక్టర్ మల్లు వేంకటరెడ్డి,**

**కౌతాలంలో ఘనంగా ముగిసిన ధార్మిక కార్యక్రమాలు**

**కౌతాళం (జయ జయహే)**

భగవన్నామం మానవుడిని పవిత్రం చేసే దివ్య సాధనమని, భగవంతుని నామాన్ని భక్తి, విశ్వాసాలతో జపించినప్పుడు మనస్సు ప్రశాంతతో పాటు హృదయం నిర్మలమవుతుందని, తద్వారా చెడు ఆలోచనలు క్రమంగా తొలగిపోయి, దైవీ గుణాలను పెంపొందించి, సత్యం, ధర్మం, దయ, ప్రేమ వంటి సద్గుణాలను వికసింపజేస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారత్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కౌతాలంలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు అక్షయ స్వామి సశాస్త్రీయంగా భక్తులందరితో పూజలు నిర్వహింపచేశారు. మూడురోజులపాటు స్థానిక భజన మండలిచే భజనలు, స్వాత్మానందస్వామి ప్రవచనాలు భక్తులను అలరింపచేశాయి. తి. తి. దే. పూర్వ దాససాహిత్యప్రాజెక్టు డైరెక్టు అప్పణ్ణాచారి భక్తులకు సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతరావు, జి. సోమశేఖర రెడ్డి, జి. శేషారెడ్డి, బి. గురు రాఘవేంద్ర రెడ్డి, జి. జనార్ధన రెడ్డి, హనుమంతప్ప, అయ్యప్ప, ఒడ్డె రాముడు, టి. లింగారెడ్డి, ఓంకారరెడ్డి, నర్సిరెడ్డి, జి. శ్రీనివాసులు రెడ్డి, జి. ఉసేని, చాకలి తిరుమల, చాకలి ఉసేని, జి. రాఘవ రెడ్డితోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## నిత్య అన్నదానికి ఎన్నారై
## రూ1,21,000 విరాళం

**పూతలపట్టు, జూలై 31, జయ జయహే.**

కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి నిత్య అన్నదాన పథకానికి ఎన్నారై విజయ్ గౌతమ్ రూ 1,21 లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. అయన ఆలయాధికారులకు శుక్రవారం చెక్కును అందజేశారు. వీరికి స్వామివారి తీర్థప్రసాదాలు శేష వస్త్రంను ఆలయ సూపర్డెంట్ వాసు, టెంపుల్స్ ఇన్స్పెక్టర్ రవి, బాలాజీ నాయుడులు అందజేశారు.

## కమ్మవారిపాలెంలో పర్యటించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

**బుచ్చినాయుడు కండ్రిగ, జులై 31,జయ జయహే.**



బుచ్చినాయుడు కండ్రిగ మండలం లోని వేణుగోపాల్పురం పంచాయతీలో ఎమ్మెల్యే అధిములం పర్యటించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మనోహర్ నాయుడు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల నరసింహనాయుడు కాలం చెందారు.అయన జ్ఞాపకార్థం ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కమ్మవారిపాలెంలో పక్షవాతం (పెరాలసిస్) వచ్చి మంచాన పడిన సుందరయ్య నాయుడు ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా సందర్శించారు.ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, కమ్మవారి పాలెం పార్టీ నాయకులు సత్యనారాయణ, బాలకృష్ణ, గోపి, పెద్ద పాలేదు చంద్ర, పద్మావతిపురం రామనాథం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.




## శ్రీకాళహస్తి కోర్ట్ వాయిదాకి హాజరైన
## వినుత కోటా.

**శ్రీకాళహస్తి, జులై 31,జయ జయహే**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు, ప్రజల తరఫున నిరంతరం పోరాడినందుకు వినుత కోటా పైన, చంద్రబాబు కోటా పైన అక్రమంగా నమోదు చేసిన 19 కేసుల్లో ఒక కేసుకు సంబంధించి, తమతో పాటు పలువురు జనసైనికులు కూడా నిందితులుగా ఉన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి కోర్ట్ కు విచారణకు వినుత కోటా తో కలిసి పలువురు జనసైనికులు హాజరయ్యారు.

# బీజేపీ సంస్థాగత వర్క్ షాప్ విజయవంతం





**శ్రీకాళహస్తి, జులై 31,జయ జయహే.**

శ్రీకాళహస్తిలో నిర్వహించిన బీజేపీ రాష్ట్ర, జిల్లా నేతలు, శ్రీకాళహస్తి నియోజకవర్గం బి ఎల్ ఏ ల సమావేశం విజయవంతం అయింది.అసెంబ్లీ కన్వీనర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ అధ్యక్షతన పోలింగ్ బూత్ స్థాయి సంస్థాగత బలోపేతంపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షిస్తూ, ప్రతి బూత్‌ను మరింత బలోపేతం చేయడం, ప్రతి ఓటరిని చేరుకోవడం, గ్రామ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని విస్తరించడం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాన్ని లక్ష్యంగా చేసుకుని కార్యాచరణ రూపొందించాలని పార్టీ శ్రేణులకు నాయకులు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో బీజేపీ జాతీయ కార్యదర్శి ఋతురాజ్ సిన్హా బీజేపీ శ్రేణులనుద్దేశించి ప్రసంగించారు.కార్యక్రమం లో తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధానకార్యదర్శిలు నాగోతు రమేష్ నాయుడు, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, మాజీ ఎంపీ వర ప్రసాద్ రావు, తిరుపతి జిల్లా ఇంచార్జి పులి వెంకట కృష్ణా రెడ్డి, అనంతపురం జిల్లా ఇంచార్జి చంద్రప్ప, రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధు సూదన్, కార్యదర్శి మేకల హనుమంత్ రావు, జిల్లా ప్రధానకార్యదర్శిలు కె. నరేష్, మునికృష్ణయ్య, ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, మండల అధ్యక్షులు పూజారి ప్రేమ్ కుమార్ రెడ్డి, వేదం కృష్ణయ్య, నరేష్, కోలా గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రానికి దశ దిశ మార్చే ఏకైక నాయకుడు చంద్రబాబు ఒక్కడే

**టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్**

**శ్రీకాళహస్తి జూలై 31, జయ జయహే:-**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దశ దిశ మార్చాలంటే ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు ఒక్కడే అని టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సూచనల మేరకు, టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలోని 19ఖు వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి, పథకాల వివరాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకు వెళుతోందని తెలిపారు. టిడిపి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటింటి చేరుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమానికి వార్డ్ ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ గోపీనాథ్ భూత్ ఇంచార్జ్ సురేష్ కార్యకర్తలు అరుల్ , తులసి అమరావతి అమ్మ ,ద్రాక్షయని, చంద్ర పాల్గొన్నారు.

## మాదకద్రవ్య రహిత నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలి

**కె. వెంకట్ ఉజ్వల్**

**గుంటూరు, జూలై 31(జయ జయహే)**



మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని మేరా యువ భారత్ ఆంధ్రప్రదేశ్,యానం రాష్ట్ర సంచాలకులు కె. వెంకట్ ఉజ్వల్ పిలుపునిచ్చారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నషా ముక్త్ యువ' దేశవ్యాప్త ప్రచారంలో యువత చురుకుగా పాల్గొనాలని కోరారు.ఆగస్టు 2 శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా యువతను ఉద్దేశించి వర్చువల్ విధానంలో ప్రసంగించనున్నారని, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతలో అవగాహన కల్పించడం,మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా వారిని ప్రోత్సహించడం,తద్వారా వికసిత్ భారత్2047 లక్ష్య సాధనకు యువశక్తిని సమర్థవంతంగా వినియోగించుకోవడం లక్ష్యంగా జరిగే ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్,ఎన్ ఎస్ ఎస్, యువజన సంఘాల, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఆధ్యాత్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక సంఘాలు తదితర సంస్థలకు చెందిన కోటికి మందికి పైగా యువత ఈకార్యక్రమంలో చురుకుగా పాల్గొనేలా చేస్తున్నామన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ 'నశా ముక్తి ప్రతిజ్ఞ' మైభారత్ పోర్టల్ లో ప్రతిజ్ఞ తీసుకోవాలని,సమాజంలో అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా క్రీడలు,ఫిట్‌నెస్,ధ్యానం, సాంస్కృతిక కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలు, వాకథాన్‌లు,వీధి నాటకాలు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.విద్యాసంస్థలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు,ప్రజలు విస్తృతంగా పాల్గొని మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




## జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ తహసిల్దార్‌కు వినతిపత్రం

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు 01,**

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ కొయ్యూరు మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల తహసీల్దార్ ప్రసాద్ కి వినతిపత్రం అందజేశారు. ఇంటి స్థలాల కేటాయింపు మరియు గృహ రుణాల సౌకర్యం, మీడియా కమిషన్ ఏర్పాటు,జర్నలిస్టుల పెన్షన్ పథకం అమలు, సమాచార శాఖ బలోపేతం,ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ సౌకర్యం, వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు మరియు మీడియా అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు, రాష్ట్ర స్థాయి అవార్డుల పునరుద్ధరణ, కార్మిక బీమా సదుపాయం, మరియు వృద్ధ జర్నలిస్టుల సంక్షేమ చర్యలు,జర్నలిస్టుల సాధారణ సమస్యల మీద వినతి పత్రం అందచేశారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేసి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ ప్రసాద్ హామీ ఇచ్చారు.



## ఘనంగా డ్రాయింగ్ పోటీ బహుమతుల ప్రదానోత్సవం

**విశాఖపట్నం జయ జయహే**

ప్రముఖ ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్ విశాఖపట్నం షోరూమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కలర్స్ ఆఫ్ జో పిల్లల డ్రాయింగ్ పోటీ మరియు బహుమతుల ప్రదానోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది.నగరంలోని ప్రముఖ ప్లే స్కూల్స్ అయిన క్యూటీస్ ప్లే స్కూల్ బస్సెల్ బాస్టిల్ బిస్ ప్రీ స్కూల్ స్పర్కలి డే కేర్ అండ్ ప్రీ స్కూల్ లకు చెందిన సుమారు 50 మంది చిన్నారులు పాల్గొని తమ సృజనాత్మక ప్రతిభను రంగుల ద్వారా అద్భుతంగా ప్రదర్శించారు. చిన్నారుల కళాత్మక నైపుణ్యం, వారి ఊహాశక్తి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో జోయాలుక్కాస్ షోరూమ్ మేనేజర్ అభిజిత్ ఎం.ఎస్ మరియు అసిస్టెంట్ మేనేజర్ వి. శ్రీనివాస్ పాల్గొని విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు, మెడల్స్ మరియు ఆకర్షణీయమైన బహుమతులను అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి చిన్నారిని అభినందిస్తూ, వారి సృజనాత్మకతను ప్రోత్సహించడం జోయాలుక్కాస్ సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు.అదేవిధంగా భవిష్యత్తులో కూడా ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తూ పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, చిన్నారులకు ఇలాంటి వేదికలను కల్పిస్తున్న జోయాలుక్కాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారుల ఆనందోత్సాహాలతో కళకళలాడిన ఈ కార్యక్రమం రంగుల హరివిల్లులా విజయవంతంగా ముగిసింది.

# సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన వన్నెంరెడ్డి



**విశాఖపట్నం (జయ జయహే)**

**భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా విశాఖపట్నం విచ్చేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ , జనసేన పార్టీ రాష్ట్ర బూత్ కమిటీ మాజీ కోఆర్డినేటర్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ ఘన స్వాగతం పలికారు.**

**రాష్ట్ర అభివృద్ధికి గేమ్ చేంజర్**

**నూతన అధ్యాయంగా నిలవనున్న భోగాపురం నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం ఆంధ్రప్రదేశ్ ప్రగతికి ముఖ్యంగా ఉత్తరాంధ్ర అభివృద్ధికి మరో మైలురాయిగా నిలవనుంది.కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రం డబుల్ ఇంజన్ సర్కార్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు**

## ఉత్తరాంధ్ర జిల్లాలోనే బాగా అభివృద్ధి చెందిన ఏఎంఏ ఎల్ కళాశాల

**అనకాపల్లి జయ జయహే**



ఉత్తరాంధ్ర జిల్లాలోనే అన్ని సదుపాయాలతో ప్రసిద్ధి చెందిన అభివృద్ధి చెందిన ఏ ఎం ఏ ఎల్ కళాశాల ఉద్యోగ ఉపాధ్యాయ అవకాశాలు కు అధిక డిమాండ్ ఉన్న బీకాం కంప్యూటర్ డిగ్రీ కోర్స్ మంజూరు అయిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ బొత్స సత్యానంద సాగర్ తెలిపారు ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు గత కొన్నేళ్లుగా విద్యార్థులు తల్లిదండ్రులు చేస్తున్న విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు అని ఆయన తెలిపారు బీకాం కంప్యూటర్స్ మూడేళ్లు డిగ్రీ కోర్స్ తో పాటు ఆసక్తి ఉన్నవాళ్లు డిగ్రీ కోర్స్ తో పాటు మొత్తం నాలుగేళ్లతో బీకాం హానర్స్ కంప్యూటర్ కోర్స్ నీ కూడా చదువుకునే అవకాశం విద్యార్థులకు కల్పించామన్నారు అనకాపల్లి వర్తక సంఘం సేవా భావంతో ఎటువంటి లాభాలు లేకుండా ఏ ఎం ఏ ఎల్ కళాశాల నిర్వహిస్తోంది అని అదే స్ఫూర్తితో కళాశాలకు బీకాం కంప్యూటర్స్ కోర్సును తీసుకొచ్చారని ప్రభుత్వం నిర్ణయించిన సాధారణ ఫీజులతోనే అడ్మిషన్ జరుగుతున్నాయి అని అన్నారు ముందుగా 50 సీట్లు భర్తీ చేశామని ఇంటర్మీడియట్ ఉత్తీర్ణైన వాళ్ళు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు అవసరమైన కంప్యూటర్ ల్యాబ్ ను సిద్ధం చేశామని అవసరమైన వారికి హాస్టల్ సీట్లు కేటాయిస్తామన్నారు ఎన్ సి సి, ఎన్ఎస్ఎస్ స్పోర్ట్స్ గ్రంథాలయం తదితర సదుపాయాలను అందుబాటులో ఉంచామన్నారు ఆసక్తి ఉన్నవారు ఇతర వివరాల కోసం కళాశాల పని వేలలో సంప్రదించాలని వారు కోరారు పూర్తి సమాచారానికి ఫోన్ సంఖ్యకు 9030640246 ఫోన్ చేసి తెలుసుకోవచ్చు అన్నారు

# 'యూత్ కనెక్ట్'లో డిఎస్పీ శివప్రియ పిలుపు

**మత్తు, బెట్టింగ్‌లకు దూరంగా ఉండండి**

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూలై31:**



ధవళేశ్వరం "ఈజీ మనీ కోసం జీవితాన్ని పణంగా పెట్టొద్దు... క్షణిక ఆనందం కోసం మీ బంగారు భవిష్యత్తును చీకటిలోకి నెట్టొద్దు. మీ కుటుంబానికి గర్వకారణంగా, సమాజానికి ఆదర్శంగా ఎదగండి" అని సౌత్ జోన్ డిఎస్పీ శివప్రియ యువతకు పిలుపునిచ్చారు.జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు గురువారం ధవళేశ్వరం రథం వీధిలో నిర్వహించిన 'యూత్ కనెక్ట్' కార్యక్రమంలో డిఎస్పి శివప్రియ మాట్లాడుతూ, నేటి యువతను గంజాయి, మత్తు పదార్థాలు, క్రికెట్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ జూదం వంటి సామాజిక దురాచారాలు లక్ష్యంగా చేసుకుంటున్నాయని వ్యక్తం చేశారు. తప్పుడు స్నేహాలు, చెడు అలవాట్లు జీవితాలను నాశనం చేస్తాయని, కష్టపడి సాధించిన విజయమే శాశ్వత గౌరవాన్ని తెస్తుందని అన్నారు.మహిళల గౌరవాన్ని కాపాడటం ప్రతి యువకుడి బాధ్యత అని పేర్కొంటూ, ఈవ్‌టీజింగ్, మహిళలపై వేధింపులు, సైబర్ నేరాలకు పాల్పడితే చట్టం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. సోషల్ మీడియాను బాధ్యతతో వినియోగించాలని, వదంతులు, అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని సూచించారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల ఎన్నో కుటుంబాలు విషాదంలో మునిగిపోతున్నాయని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు.యువతలో చైతన్యం పెంచి, వారిని నేరాల బారిన పడకుండా కాపాడటం పోలీసు శాఖ బాధ్యత. పోలీసులను భయపడాల్సిన అవసరం లేదు... సమస్య వచ్చినప్పుడు ముందుగా గుర్తుకు రావాల్సింది పోలీసులేనని" డిఎస్పీ శివప్రియ అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐ గణేష్, ఎస్ఐ హరిబాబు, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజేంద్రపాలెంలో ఇంటింటికి తెలుగుదేశం

## ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వివరించిన గిడ్డి ఈశ్వరి

**కొయ్యూరు : (జయ జయహే)న్యూస్ ఆగష్టు 01,**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గిడ్డి ఈశ్వరి శుక్రవారం కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గ్రామంలో "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో పాల్గొన్నారు.టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం గత 2 ఏళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, స్త్రీ శక్తి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మెగా డీఎస్సీ వంటి పథకాల ద్వారా ప్రజలకు జరిగిన మేలును తెలియజేశారు. గిరిజన ప్రాంతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి చంద్రబాబు పాలనలో జరిగిందని, "2 ఏళ్ల నమ్మకం" కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమం లో



రాష్ట్ర జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, మాజీ ఎంపీపీ బొర్రా విజయ రాణి, మండల నాయకులు తోట దొరబాబు, గాం రమాదేవి, బోనంగి సత్యవతి, దారకొండ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు భూములు ఇవ్వమని తేల్చి చెప్పిన రైతులు

**నక్కపల్లి జయ జయహే**

నక్కపల్లి మండలం,గునిపూడి గ్రామంలో సర్వే నెంబర్ 24/10 లక్ష్మీ దేవి కొండ పై సాగు చేసుకుంటున్న రైతులు భూములు ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ టౌన్ షిప్ కు ఇవ్వలేమని ఆ భూములే మాకు జీవనాధారమని శుక్రవారం గ్రామంలో జరిగిన సాగు దార్లు నిర్వహించుకున్న గ్రామ సభలో అభిప్రాయ పడ్డారు, గత ఎనబై సంవత్సరాలు గా పేదలు లక్ష్మీ దేవి కొండ పై జీడి మామిడి తోటలు వేసుకొని వచ్చిన ఫలసాయం కుటుంబాలు పోషించుకుంటున్నామని, అనేక పర్యాయాలు రెవెన్యూ అధికారులకు మేము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని అర్జీలు పెట్టుకున్న పట్టాలు ఇవ్వని ప్రభుత్వం ప్రైవేటు కార్పొరేట్ కంపెనీకి ఆ భూములు ఎలా ఇస్తారని ప్రశ్నించారు,పేద ప్రజలకు ఒక న్యాయం, కార్పోరేట్ కంపెనీకి ఒక న్యాయమా అని ప్రశ్నించారు. పైగా ఇప్పుడు అధికారులు ఆ భూములు ప్రభుత్వానివి మేము తీసుకుంటామం టున్నారు,2013 భూసేకరణ చట్టం ప్రకారం మూడు సంవత్సరాలకు పైగా ఎవరైనా పేదలు



సాగు లో ఉంటే ఆ భూములు మీద సర్వ అధికారాలు సాగు దార్లు కే ఉంటాయని తెలిపారు,అయినా ఇక్కడ అధికారులు చట్టాలను, కోర్టు తీర్పులను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా పేదలకు అన్యాయం చేస్తున్నారని అధికారులు తమ వైఖరి మార్చుకోవాలని సూచించారు. ఈభూములలో ఎటువంటి పనులు చేపట్టరాదని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, స్థానిక నాయకులు డీ.క్రృష్ణ,వి.అప్పారావు,బి.బాబ్జీ,బి.నాయుడు,పి.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ మలేరియా కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు

## జిల్లా మలేరియా అధికారి

**విశాఖపట్నం (జయ జయహే)**

మలేరియా, డెంగు ప్రబలే సీజన్ ప్రారంభం కావడంతో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వరప్రసాద్ రెడ్డి, బయాలజిస్ట్ సాంబమూర్తిలు పిలుపునిచ్చారు. డెంగీ మాసోత్సవము సందర్భంగా ప్రజల్లో కీటక జనిత వ్యాధులు పై అవగాహన ప్రదర్శనను దొండపర్తి లో అసిస్టెంట్ మలేరియా అధికారి బి. నాగభూషణరావు ఆధ్వర్యంలో జీవీఎంసీ మలేరియా విభాగం తో సంయుక్తంగా శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమల ఉత్పత్తి నివారణకు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను గుర్తించి తొలగించాలన్నారు. ఈ ప్రక్రియను ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రకారంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సందర్శన తప్పనిసరిగా చేయాలని క్షేత్రస్థాయిలో జ్వర పీడితులను గుర్తించి తక్షణ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.



డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం మంగళవారం విధిగా నిర్వహించాలని అన్నారు. దోమలు ఉత్పత్తి నివారణకు జీవీఎంసీ ఏఎల్ఓ బృందంతో కలిసి సంయుక్తంగా నిర్వహించాలని సూచించారు. . తొండపర్తి వైద్యాధికారి డాక్టర్ శ్రావణి, మలేరియా విభాగం సిబ్బంది, లంక శ్రీనివాసరావు కేఎన్ఎస్ రెడ్డి, జీవీఎంసీ మలేరియా విభాగం సూపర్వైజర్లు ఆరోగ్య కార్యకర్తలు,ఆశాలు, తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## జర్నలిస్ట్ డిమాండ్ డే సందర్భంగా కలెక్టరేట్‌లో వినతి

**రాజమహేంద్రవరం: జయ జయహే :జూలై 31**

ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా నిలిచి ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిబిజెఎ)నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్ట్ డిమాండ్ డే సందర్భంగా రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు శుక్రవారం జిల్లా విలేకరులు కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రాత్రింబవళ్లు ప్రజల మధ్య ఉంటూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరించడం తగదన్నారు. రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు అందించాలని కోరారు. విధి నిర్వహణలో జర్నలిస్టులపై పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి. రవికుమార్, జిల్లా ఉ



పాధ్యక్షురాలు దేవులపల్లి అన్నపూర్ణ విశాలాక్షి, జిల్లా కార్యదర్శి పి. వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎపిబిజెఎ ప్రతినిధులు, అలాగే వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలకు చెందిన విలేకరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 7 కి.మీ బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన గిడ్డి ఈశ్వరి

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్**

అల్లూరి జిల్లా కొయ్యురు మండలం అంతాడాలో జన్మాన్ నిధులతో 6 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన అంతాడ గ్రామం నుండి ఎద్దుమామిడి, సింగధర, గంపరాయి మీదుగా డేకురాయి వరకు 7 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులకు పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరిగింది.ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో మారుమూల గిరిజన ప్రాంతాలకు కూడా సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్-సిక్స్ హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చామని గుర్తు చేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ల కాలంలో రోడ్లు, తాగునీరు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ రోడ్డుతో 4 గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమం లో ఎంపీపీ బడుగు రమేష్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, కోఆపరేటివ్ చైర్మన్ సమ్మర్ల సాంబశివ, ఎంపీటీసీ ఇరువాడ సత్యవాణి, బీజేపీ కోఆపరేటివ్ డైరెక్టర్ రిమల చంద్రరావు, యూనిట్ ఇన్చార్జి సుంకరి బాలకృష్ణ, క్లస్టర్ ఇన్చార్జ్ బోనంగి సత్యవతి, మండల ఉపాధ్యక్షురాలు గాం రమాదేవి, డైరెక్టర్లు సాంబమూర్తి, వరలక్ష్మి, రాజేశ్వరి, దేవి, సీనియర్ నాయకులు దారకొండ నారాయణమూర్తి, కో-క్లస్టర్ కీర్తి కుమార్, పాడి వెంకటేష్, కునిశెట్టి సత్తిబాబు, గాలి చిన్నారావు, లోత సింహాచలం, మాజీ సర్పంచ్ చంద్రరావు, వైస్ ఎంపీపీ నూకాలమ్మ, గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# జవహర్ సేవలు అపురూపం...!

## కొనియాడిని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

**విశాఖపట్నం, జూలై 31, జయ జయహే**

తోటి మనుష్యులకు ఉపకారం అందించడంలో జవహర్ లాల్ మించిన వ్యక్తులు లేరని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ వాణి పేర్కొన్నారు. శుక్రవారం ఆంధ్రా వైద్య కళాశాల ఆఫీస్ సూపరింటెండెంట్ జవహర్‌లాల్ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆమె మాట్లాడుతూ జవహర్ కోసం ప్రత్యేకించి ఎంత చెప్పినా తక్కువేనని...ఈ సన్మానానికి వచ్చిన వందలాది మందే ఆయన సేవలకు ప్రత్యక్ష సాక్ష్యమని కొనియాడారు. ఆంధ్రా వైద్య కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. కృష్ణ వేణి మాట్లాడుతూ జవహర్ చేసే పనులు ఎవరికీ అంతుబట్టేవిగా ఉండవన్నారు. ఆయన అందించే పనులు సామాన్యులు ఎవరూ చేయలేరని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. రాజ్‌కమల్ మాట్లాడుతూ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా జవహర్ అందించిన సేవలు ...



# బాడీ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**అనకాపల్లి (జయ జయహే)**

ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఫౌండర్ కె. గురునాధరావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు రాష్ట్ర సెక్రెటరీ టి. రాము, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ లు ఎం.ఎన్.ఎస్. అప్పారావు శ్రీనివాసరావు, రాష్ట్ర లీగల్ అడ్వైజర్ కేలం చంద్రశేఖర్, పర్యవేక్షణలో అనకాపల్లి గవరపాలెం కామాక్షి అమ్మవారి దేవస్థానంలో అనకాపల్లి జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం ఏర్పాటు చేయడం జరిగింది.జిల్లా గౌరవాధ్యక్షులు గా కోరిబిల్లి సోమినాయుడు, ముఖ్య సలహాదారులు అప్పారావు, బి.బాలాజీ బద్రీనాథ్,జిల్లా లీగల్ అడ్వైజర్ కేలం చంద్రశేఖర్,జిల్లా అధ్యక్షులు గా విల్లూరి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా అమ్ములోజు శ్రీను, కోశాధికారిగా ఆడారి నాయుడు, అసోసియేట్ సెక్రటరీ గా ఆళ్ళ ప్రవీణ్ కుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు మరియు అధిక సంఖ్యలో వ్యాయామశాల అధినేతలు, క్రీడాకారులు క్రిడా అభిమానులు పాల్గొన్నారు.

# జనసమీకరణ ఏర్పాట్లపై మంత్రులతో గంటా చర్చ





**భీమిలి, జులై 31: (జయ జయహే)**

భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి జనసమీకరణ ఏర్పాట్లపై టీడీపీ ముఖ్యనాయకులు భీమిలి పార్టీ ఆఫీస్ లో శుక్రవారం సమీక్షించారు. భీమిలి నుంచి బయలుదేరే బస్సులు, భోజన ఏర్పాట్లు, పార్కింగ్ సౌకర్యం తదితర అంశాలపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంత్రులు పి. నారాయణ, గొట్టిపాటి రవికుమార్, ఎం.రాంప్రసాద్ రెడ్డి, కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణలతో కలిసి చర్చించారు. భీమిలి నియోజకవర్గం నుంచి బయలుదేరే 640 బస్సులు రూట్లు ఖరారు చేశామని నారాయణ తెలియజేశారు. 29 వేల మందిని సభకు తరలించడానికి బస్సులు సిద్ధం చేశామని గంటా చెప్పారు. పద్మనాభం పరిసర ప్రాంతాల వారికి భోగాపురం వెళ్లి రావడానికి ఇబ్బంది లేకుండా తాటితూరు దగ్గర్లో బస్సు పార్కింగ్ సదుపాయం కల్పించాలని ఆర్డీఓ సంగీత్ మాధుర్ కు సూచించారు. యాప్ ద్వారా బస్సుల కదలికలు విశ్లేషిస్తారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర గ్రోత్ ఇంజన్ భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని మంత్రులు కోరారు. నియోజవర్గ పరిశీలకులైన ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భాష్యం ప్రవీణ్, అశోక్ రెడ్డి, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, భీమిలి పార్టీ ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

**బస్సు పార్కింగ్ స్థలాల పరిశీలన**

అంతకుముందు భోగాపురం ఎయిర్ పోర్టు జనసమీకరణ కోసం ఉద్దేశించిన బస్సులను భోజన సౌకర్యం కల్పించడానికి నిలుపు చేసే పార్కింగ్ స్థలాలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. అమనాం, పోలిపిల్లి, సవరవల్లి, తగరపువలస, చిట్టివలస, దొరతోట, బొడ్డపాలెం తదితర ప్రాంతాల్లో పార్కింగ్ కు అనువైన లే అవుట్లు, ఖాళీ స్థలాలను పరిశీలించారు.

## కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిని కలిసిన చొక్కాకుల

**భోగాపురం (జయ జయహే)**



భోగాపురం అల్లూరి సీతా రామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ను మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు చొక్కాకుల వెంకటరావు



## గోదావరి తొలి ప్రమాద హెచ్చరిక

**రాజమహేంద్రవరం జయ జయహే : జూలై 31 :**

ధవళేశ్వరంగోదావరి నదిలో వరద ఉధృతి రోజురోజుకూ పెరుగుతుండటంతో తీరప్రాంత ప్రజలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అప్రమత్తం చేసింది. శుక్రవారం రాత్రి 9 గంటల నాటికి ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గేజ్ స్థాయి 8.80 అడుగులకు చేరగా, 5,36,467 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో రూపంలో నమోదైనట్లు వెల్లడించింది ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే ఈ రాత్రి తొలి ప్రమాద హెచ్చరిక, శనివారం రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.వరద ప్రభావం తీవ్రతరమయ్యే అవకాశాల నేపథ్యంలో తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల యంత్రాంగాన్ని ఇప్పటికే అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు మూడు ఎన్డీఆర్ఎఫ్ మూడు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు.గోదావరి పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు, లంక గ్రామాల ప్రజలు ఆలస్యం చేయకుండా సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని అధికారులు సూచించారు. అలాగే వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో వాగులు, వంకలు, కాజ్‌వేలు దాటే ప్రయత్నం చేయొద్దని హెచ్చరించారు.ప్రజలు గోదావరి నదిలో స్నానాలు, ఈత, చేపల వేట వంటి కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే 112, 1070 లేదా 1800 425 0101 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.వరద పరిస్థితులపై ప్రభుత్వం నిరంతరం నిఘా ఉంచిందని, ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించి అప్రమత్తంగా ఉండాలని అధికారులు పునరుద్ఘాటించారు.

# మన నేస్తరకం భూమాతతో..





**- ప్రకృతి వనరుల పరిరక్షణ మానవాళి బాధ్యత**

**- రసాయన ఎరువులు, క్రిమి సంహారకాలతో భూమిని విషతుల్యం చేయవద్దు**

**- ప్యాకెట్ ఫుడ్, జంక్ ఫుడ్ వద్దే వద్దు: జెవి రత్నం,**

**విశాఖపట్నం (జయ జయహే)**

మన నేస్తరికం భూమాతతో అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం విశాఖ జిల్లా ఆనందపురం మండలంలోని బోని గ్రామం వద్ద మారికవలస చెందిన ఇంటెలి విద్యార్థుల చేత వరి నాట్లు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి పుట్టి రెండు లక్షల సంవత్సరాల అయిందని, అప్పటినుండి మనుషులు ఆయురారోగ్యాలతో జీవించడానికి ఉపకరిస్తున్న భూమాత పరిరక్షణ, ప్రకృతి వనరుల పరిరక్షణ, సమస్త జీవావరణ పరిరక్షణ మానవాళి బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. అందుకే మన నేస్తరకం భూమాత తో అని తెలియజేశారు. ప్రకృతి ఆధారంగా పంటలు పండించాలని కోరారు. ప్రకృతి వనరుల పరిరక్షణ మానవాళి బాధ్యత అని అన్నారు. రసాయన ఎరువులు, రసాయన గడ్డి తీత మందులు, రసాయన క్రిమి సంహారకాలతో భూమాతను విషతుల్యం చేయవద్దు అని వేడుకున్నారు. ఇవన్నీ మన తాగే నీటిని, గాలినీ, ఆహార పదార్థాలను విషమయం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి తాము భుజించే ఆహారం ఎలాంటిది, దానిని ఎలా ఉత్పత్తి చేశారు అనే విషయాలను తెలుసుకుని భుజించాలని కోరారు. ప్యాకెట్ ఫుడ్, జంక్ ఫుడ్ వద్దే వద్దని, వాటి వల్ల కలిగే అనారోగ్యాలను తెలుసుకొని వాటికి దూరంగా జీవించాలని కోరారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులను ఆరోగ్యకరమైన ఆహారం ఇవ్వాలని కోరాలని వివరించారు. నిల్వ ఉండడానికి తయారు చేసే పదార్థాలు ప్యాకెట్ లో పెట్టినప్పుడు అవి నిల్వ ఉండటానికి వాడే రసాయనాలు ఆరోగ్యకరమైనవి కావని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో "ద ఇంటెల్లి స్కూల్" ఉపాధ్యాయులు నాగమణి, సత్యవతి, సంధ్యారాణి, అపర్ణ , ఛాయాచిత్రకారుడు సంతోష్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో సమన్వయకర్త జె రాజేశ్వరి, యాక్షన్ ఎయిడ్ ఎన్జీవో ప్రతినిధి ఐ కృష్ణ కుమారి తదితరులు పాల్గొని మాట్లాడారు. వందమంది విద్యార్థులు నాట్లు వేసే కార్యక్రమంలో పాల్గొన్నారు.



## అనాథలైన పిల్లలకు 'గరుడ గ్రూప్' రూ.20 వేల ఆర్థికసాయం

**బుచ్చినాయుడు కండ్రిగ, జులై 31,జయ జయహే.**

కంచనపుత్తూరు గిరిజన కాలనీలో గత శుక్రవారం రాత్రి పాముకాటుకు గురై వెంకటరత్నమ్మ (28) అనే పశువుల కాపరి మృతి చెందింది.ఆమె భర్త ఎనిమిది సంవత్సరాల క్రితమే చనిపోవడంతోముగ్గురు పిల్లలను పశువులు మేపుకుంటూ ఆమె ఒక్కరే ఎంతో కష్టపడి పోషిస్తూ వచ్చారు. ఇప్పుడు తల్లి కూడా మరణించడంతో ఆ ముగ్గురు చిన్న పిల్లలు అనాథలుగా మారారు. పరిస్థితిని తెలుసుకున్న 'గరుడ గ్రూప్' సభ్యులు తక్షణమే స్పందించారు. బాధితురాలి కుటుంబానికి అండగా నిలిచేందుకు ముందుకు వచ్చి, రూ. 20,000 ఆర్థిక సహాయాన్ని ఆ పిల్లలకు అందజేశారు. దాతలకు గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.



## శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్న ఇఫ్కో చైర్మన్ దిలీప్ సంఘాని

**శ్రీకాళహస్తి, జులై 31,జయ జయహే.**

ఇఫ్కో చైర్మన్ దిలీప్ సంఘాని శుక్రవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.



## దేవస్థానంలో షాపులు తొలగింపు పై స్పందించిన మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్

**శ్రీకాళహస్తి, జులై 31,జయ జయహే.**

శ్రీకాళహస్తీశ్వర స్వామి, అమ్మవార్ల దర్శనార్థం విచ్చేసే భక్తుల సౌకర్యార్థం, ఆలయ సుందరీకరణ (బ్యూటీఫికేషన్) ప్రాజెక్టులో భాగంగా మొదటి గోపురం సమీపంలోని గోశాల వద్ద చేపడుతున్న నిర్మాణాల వల్ల కొన్ని కుటుంబాల జీవనోపాధి దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. దశాబ్దాలుగా అక్కడే చిన్న చిన్న షాపులు ఏర్పాటు చేసుకుని కొబ్బరికాయలు, పూలు, పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న సుమారు 10 కుటుంబాలను తక్షణమే ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించడంతో ఆ వ్యాపారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిపరిస్థితిని సమీక్షించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వర్లుకు ఫోన...

## బైక్ చోరీపై ఫిర్యాదు

**శ్రీకాళహస్తి, జులై 31,జయ జయహే.**



శ్రీకాకుళం జిల్లా, ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన మాధవరావు బసవయ్యపాలెం (నందిని సర్కిల్ సమీపం)లో నివాసముంటూ గ్రీన్ ప్యానెల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్లో మెకానికల్ ఫిట్టర్ గా పనిచేస్తున్నారు. తల్లి అనారోగ్యంతో స్వగ్రామానికి వెళ్లే సమయంలో పార్కింగ్‌లో ఉంచిన ఆయన పల్సర్ బైక్ (ఏపీ 39 జే వి 7566) ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు.ఈ విషయంగా జనసేన నాయకుడు దండి నరేంద్ర బాధితుడితో కలిసి టూ -టౌన్ పోలీస్ స్టేషన్లో సీఐ నాగరాజు ని కలిసి ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్ పరిశీలనతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వాహన ట్రాకింగ్ వ్యవస్థకు బైక్ వివరాలను అనుసంధానం చేసి గుర్తించే చర్యలను సీఐ చేపట్టారు. కొద్ది రోజుల పాటు ట్రాకింగ్ కొనసాగించి, అవసరమైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి బైక్‌ను గుర్తిస్తామని సీఐ తెలిపారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com